
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 141 | హైదరాబాద్ | శుక్రవారం 21-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

ఒకేసారి 130 మందికి ప్రమోషన్లు..
రేవంత్ సర్కార్ కీలక ఉత్తర్వులు

*రిజర్వేషన్లు 50 శాతం మించకుండా..*

## ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక






11లో

- పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన డెడికేషన్ కమిషన్
- పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా నివేదిక

డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయనున్న ప్రభుత్వం

### విరాళాల పేరిట మోసం..

భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ



11లో

## నేటి భారతం

- ప్రజల భద్రత కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టే వ్యక్తి పోలీస్..
- అపరిచితుడికైనా అండగా నిలవడం పోలీస్ ధర్మం.
- భయం లేకుండా జీవించే సమాజం కోసం భయపడకుండా నిలబడేది పోలీస్.
- సేవ చేయడం ఉద్యోగం కాదు, ఒక బాధ్యత.. అలాంటి వారే పోలీసులు..
- అంధకారం మధ్యలో వెలుగును చూపే దీపం లాగా.. సంక్షోభ సమయంలో ఆశను చూపే వారు పోలీస్.
- జీవితం ప్రమాదంలో పెట్టుకుని కర్తవ్యాన్ని నిర్వర్తించడం.. అది కేవలం పోలీసులకే సాధ్యం..
- ప్రజల నిద్రకు రక్షణగా ఉండడం కోసం రాత్రులు నిద్రపోనివారే పోలీసులు..
- ప్రతిసారీ గెలిచే యుద్ధాలు కనబడవు... కానీ ప్రతి యుద్ధం వెనుక ఒక పోలీస్ ఉంటాడు.
- రక్షణ అనేది ఆయుధాల్లో కాదు.. రక్షించే మనసులో ఉంటుంది...
- అలాంటి పోలీసులను స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకోవడం దారుణం.. ప్రభుత్వాలు మారాలి..

– ఇంద్రిపల్లి గోవర్ధన్


11లో

భారత వాయుసేన స్వరూపాన్నే

## మార్చే ప్రతిపాదన..

పుతిన్ పర్యటనకు ముందు రష్యా కీలక అడుగు

# తెలుగులో.. మాట్లాడండి

- త్వరలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం
- కలెక్టర్లు, మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్
- ఇంగ్లీషులో మాట్లాడే ప్రయత్నం చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్
- స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నందున తెలుగులో మాట్లాడాలని సూచన


11లో

### ఈ నెల 24 నుంచి రైతన్నా.. మీకోసం

: 10 వేలమందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

11లో


12లో

# వెంటాడుతున్న వైఫల్యాలు..

(పార్ట్ 4)




ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర హోం శాఖ తీవ్ర ప్రభావం చూపుతుంది.. రాష్ట్రంలో శాంతి భద్రతలు సజావుగా సాగాలంటే హోం శాఖ సమర్ధవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. అందుకనే హోం శాఖ నిర్వహణ సమర్ధవంతమైన వారి వద్ద ఉండాలి.. కానీ అన్ని ప్రభుత్వాల్లో ప్రతి సారి కీలకమైన హోం శాఖను కొన్ని సందర్భాల్లో తప్ప అనుభవం లేని వారికే కేటాయించడం జరుగుతూఉంది.. ఎందుకిలా జరుగుతోంది.. మేధావులు చెబుతున్న దాన్ని బట్టి చూస్తే ఎవరైతే హోం శాఖను నిర్వహిస్తూ ఉంటారో.. వారి ఆధీనంలోనే శాంతి భద్రతలు, రక్షణ తదితరాలు ఉంటాయి.. ఈ శాఖ మంత్రి తలచుకుంటే అధికార ప్రభుత్వాన్ని తారుమారు చేయగలడు అన్నది నిర్వివాదాంశం.. అందుకే ఏ ముఖ్యమంత్రి అయినా హోం శాఖను తనకు అనుకూలంగా వుండే వారికే కేటాయిస్తారు.. తాము చెప్పినట్లు నడుచుకునే వారికే మాత్రమే ఇవ్వడం మనం చూస్తున్నాం.. మరీ ముఖ్యంగా మహిళా నాయకురాళ్లకు హోం శాఖను ఇస్తూ ఉంటారు.. ఎందుకంటే వారు చెప్పినట్లు వింటారు.. ఎదురుతిరిగే సాహసం చేయలేరు.. ఒక రబ్బర్ స్టాంప్ లా ఉండిపోతారు.. కానీ హోం శాఖను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకునే ముఖ్యమంత్రులు ఉన్నంతకాలం శాంతి భద్రతలు కుంటుబడుతాయి.. కేవలం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి, విపక్షాలను అదుపుచేయడానికి హోం శాఖను వినియోగించుకోవడం ఎంతో గర్హనీయం.. ఇది రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అవుతుంది..


11లో

ముఖ్యమంత్రిగా 10వ సారి

## ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్

- హాజరైన మోదీ, చంద్రబాబు
- పాట్నాలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమం
- నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం

# పని చేయని ఓటు చోరీ

స్వాతంత్ర్య సాధన ఉద్యమ పార్టీగా, స్వతంత్ర భారతదేశాన్ని అత్యంత ఎక్కువకాలం పాలించిన పార్టీగా కాంగ్రెస్‌కు పేరుంది. కానీ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం రాజకీయంగా అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ, ఇటు ఆయా రాష్ట్రాల్లోనూ సొంతంగా పోటీచేసినా, అవసరాన్ని బట్టి ఇతర పార్టీలతో కూటమిగా ఏర్పడి పోటీచేసినా పెద్దగా ప్రభావం చూపలేకపోతుంది. కొంతకాలంగా ఆయా ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోవడంపై ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆసక్తికరమైన ఆరోపణలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా కేంద్రంలోని బీజేపీ, కేంద్ర ఎన్నికల కుమ్మక్కు అయి ఓట్ చోరీకి పాల్పడుతుందని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందని పలు సమావేశాలు నిర్వహించి కూడా ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఘోరమైన పరాభవాన్ని మూటగట్టుకున్నది. కానీ బీహార్‌లో కూడా ఓట్ చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది. దీనికి ప్రధాన కారణం బీహార్ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరిట రాష్ట్రంలోని 65 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. అయితే ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున పోరాటం చేశారు. కానీ ఫలితాల్లో ఇది ఎలాంటి ప్రభావమూ చూపలేదు. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న సంస్థాగత లోపమే కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఆయా అంశాలకు సంబంధించిన ఆరోపణలకు మాత్రమే పరిమితమవుతుందని, వాటిని నిరూపించే ప్రయత్నం, వాస్తవాలను బహిర్గతం చేసే ప్రయత్నం గానీ చేయడం లేదని స్పష్టం చేస్తున్నారు. రాజకీయంగా సానుకూలంగా మార్చుకోగలిగే పరిణామాల ను కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతుంది. ఇలాంటి పరిస్థితుల కారణంగా కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ దేశవ్యాప్తంగా రాజకీయ పట్టును కోల్పోతుందని హెచ్చరిస్తున్నారు. దీనికి బీహార్ ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనమని ఉదాహరిస్తున్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ నాయకులతో ఇటీవల ఒక సమావేశాన్ని నిర్వహించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో అభ్యంతరం తెలుపుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో ఓటర్ల జాబితాలో ఏర్పడిన సందిగ్ధతపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను తమకు అందించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ ఓటర్లను ఏ ప్రాతిపదికన తొలగించారో తాము కూడా తెలుసుకుంటామని స్పష్టంచేసింది. అదేవిధంగా తొలగించిన ఓటర్ల వివరాలతో కూడిన కాపీని ఏడీఆర్‌కు కూడా అందించాలని స్పష్టం చేసింది. బీహార్‌లో ఎస్ఐఆర్ కోసం ఈసీ జారీచేసిన ఆదేశాలను ఏడీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీంతోపాటు తాజాగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లు, వివరాలను బహిరంగంగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేసింది. జాబితాల నుంచి తీసేసిన ఓటర్లు మృతిచెందారా?. శాశ్వతంగా వలసపోయారా?. అనే విషయాలను స్పష్టం చేయాలని కోరింది. ఆ సంస్థ ఫిర్యాదుపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం తొలగించిన ఓటర్ల వివరాలు, తొలగింపునకు గల కారణాలను వెల్లడించింది. బీహార్ ఓటర్ల జాబితా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం 65 లక్షల మందిని తొలగించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా సంబంధిత ఫారాలను సమర్పించడానికి గడువుకు ఒక రోజు ముందే వారందరినీ ఓటర్ల జాబితా నుంచి తొలగించనున్నట్టు తెలిపింది. లిస్టు నుంచి తీసేసే ఓటర్లలో 21.6 లక్షల మంది మరణించారని, 31.5 లక్షల మంది శాశ్వతంగా బీహార్ వదిలి వెళ్లారని, 7 లక్షల మంది రెండు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, లక్ష మంది ఆచూకీ తెలియడం లేదని ఈసీ పేర్కొంది. భారీగా ఓటర్లను తొలగిస్తే బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాల్లో సగటున ఒక్కో నియోజకవర్గానికి 25 వేలకు పైగా పేర్లు డిలీట్ అయ్యాయి. అయితే ఈ పరిణామం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో అనేక స్థానాల్లో పలువురు అభ్యర్థులు స్వల్ప తేడాతో విజయం సాధించారని గణాంకాలు చెబుతున్నాయి. దీంతోపాటు ప్రస్తుతం ఎన్నికల సంఘం ఆయా నియోజకవర్గాల్లో తొలగించిన ఓట్ల కంటే తక్కువ తేడాతో కూడా ఓడిపోయారు. అయితే ఈసీ నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్, ఆర్జేడీలు వ్యతిరేకించాయి. దీనిని తొందర పాటు చర్యగా అభివర్ణిస్తూ నిరసనలు కూడా తెలుపుతున్నాయి. అయితే ఓటర్ జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఆరోపణలకు, నిరసనలకు మాత్రమే పరిమితమైంది. జాబితా సరి చేయడంలో తమ వంతు బాధ్యతను విస్మరించింది. ఫలితంగా ఎన్నికల ఫలితాల్లో ఘోరంగా భంగపాటుకు గురైందివాస్తవానికి ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను తొలగించినప్పటికీ అభ్యంతరం ఉన్న వారు సరైన పత్రాలు చూపించి తిరిగి నమోదు చేసుకోవచ్చు. జాబితాలో తిరిగి నమోదు చేయించుకునేందుకు నెల రోజుల గడువు ఇచ్చినా దీనిని కాంగ్రెస్ వినియోగించుకోలేదని వాదనలు వినిపిస్తున్నాయి. బీహార్‌లో కాంగ్రెస్ కూటమి ఓడిపోవడానికి స్వయం కృతమే కారణమని స్పష్టంగా తెలుస్తుంది. మొదటి నుంచి ఆ పార్టీ ఈవీఎం, ఓట్ల చోరీ అంశాలను మాత్రమే ప్రధానంగా ఎత్తి చూపుతున్నది. బీహార్‌లో కాంగ్రెస్ కూటమి ఓటమికి వారు చేసిన రాజకీయాలే కారణం. నితీష్ కుమార్‌పై ఉన్న అధికార వ్యతిరేకతను ఓట్లుగా మలచుకుని యువతకు అద్భుతమైన భవిష్యత్ ఇస్తామని నమ్మకం కల్పించాల్సింది పోయి, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నట్లుగా వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు ఓటర్ అధికార యాత్ర చేశారు.

## పరకామణి కేసు

# టార్గెట్ కరణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డేనా



తిరుమల, నవంబర్ 20,

రెండు కీలక కేసులు. వాటి చుట్టే రచ్చ. తిరుమల శ్రీవారి కొండంత రాజకీయం. అటు పరకామణి చోరీ కేసు..ఇటు కల్తీ నెయ్యి ఇష్యూ..రెండూ పీక్ లెవల్‌కు చేరుకున్నాయి. ఎన్నికలకు ముందు పరకామణి వివాదం రచ్చకెక్కితే..ఎలక్షన్ అయిపోయాక కల్తీ నెయ్యి ఎపిసోడ్ కాక రేపుతూ వస్తోంది. ఫైనల్‌గా రెండు కీలక కేసుల్లో దర్యాప్తు నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంటోంది. పరకామణి చోరీ కేసు జఠిలం అవుతోందా? కల్తీ నెయ్యి కేసు లాస్ట్ స్టేజ్‌లో ఉందా? ఈ రెండు కేసుల్లో ఆ ఇద్దరే టార్గెట్టా?రెండు కీలక కేసుల చుట్టూ కొండంత వివాదం అవుతోంది. అసలే కోట్లాది మంది భక్తులు విశ్వసించే తిరుమల శ్రీవారికి సంబంధించిన ఇష్యూస్. ఒకటి పరకామణి చోరీ కేసు. రెండోది కల్తీ నెయ్యి ఘటన. పరకామణి చోరీ కేసు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పెద్ద వివాదం అయింది. అప్పట్లో అది సెటిల్ అయినా లేటెస్ట్‌గా మూడు నెలల నుంచి పెద్ద చర్చగా కొనసాగుతోంది. పరకామణి చోరీ చేసిన వ్యక్తి ఆస్తుల జప్తు..అతని ఆస్తులపై ఏసీబీ దర్యాప్తు ఇలా రోజుకో డెవలప్‌మెంట్ జరుగుతుండగానే..సాక్షి సీఐ సతీష్ మృతి చెందడంతో కేసు కొత్త టర్న్ తీసుకున్నట్లు అటు సతీష్‌ది ఆత్మహత్య అని వైసీపీ..హత్య అని టీడీపీ డైలాగ్ వార్‌కు దిగుతున్నాయి. టీడీపీ ఓ అడుగు ముందుకేసి వైసీపీ నేతలు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డే..సతీష్‌ను చంపించారని కూడా ఆరోపిస్తోంది. ఇంకా పోలీస్ దర్యాప్తు కొనసాగుతుండగానే..సతీష్ డెత్ మిస్టరీ చుట్టూ రాజకీయం రంకెళ్లు వేస్తోంది. మరోవైపు పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విచారణకు హాజరయ్యేందుకు వెళ్తుండగా సీఐ సతీష్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో..ఈ కేసులో నిందితుడు రవికుమార్‌తో పాటు సాక్షులకు భద్రత కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పరకామణి చోరీ కేసు విచారణ ముగిసే వరకు సాక్ష్యులకు ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆర్డర్స్ ఇచ్చింది న్యాయస్థానం. అయితే వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి టార్గెట్‌గానే పరకామణి కేసు కొనసాగుతోందన్న టాక్ వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి..టీటీడీ పనితీరు బాలేదంటూ పదేపదే మీడియా ముందు వాలిపోతూ ఆరోపణలు, విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే గోశాల, విష్ణుమూర్తి విగ్రహం ఇష్యూలో భూమన టీటీడీపై సీరియస్ అలిగేషన్స్ చేశారు. ఆ తర్వాత ఆయనపై కేసులు, నోటీసులు, విచారణ అంటూ హడావుడి నడిచింది. అయితే భూమన ఛైర్మన్‌గా ఉన్న సమయంలోనే పరకామణి కేసును ప్రైవేటు సెటిల్‌మెంట్ చేశారని..నిందితుడు రవికుమార్ ఆస్తుల విషయంలో ఏదో గోల్‌మాల్ ఉందన్న ఆరోపణలు వ్యక్తం చేస్తోంది టీడీపీ. ఈ క్రమంలోనే సతీష్‌ది ఆత్మహత్య అంటూ భూమన చేసిన వ్యాఖ్యలను కూడా టీడీపీ అస్త్రంగా వాడుకుంటుంది. సతీష్‌ది హత్యా? ఆత్మహత్యా? లేక ఆకస్మిక మరణమా అని పోలీసులు తేల్చకముందే ఆత్మహత్య అని భూమన ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నిస్తోంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కూడా పరకామణి కేసుపై రియాక్ట్ అయ్యారు. పరకామణి కేసును నిష్పక్షపాతంగా విచారించాలని ప్రభుత్వానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఇక తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై కూడా ఇప్పటికీ తీవ్ర దుమారం నడుస్తూనే ఉంది. గత ఎన్నికల తర్వాత వెలుగులోకి వచ్చిన కల్తీ నెయ్యి కేసు ఇప్పటికీ కాక రేపుతోంది. ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ అప్పన్న అరెస్ట్ అయ్యాడు. ఆయనను



కస్టడీకి తీసుకుని సిట్ విచారించింది. వైవీతో సంబంధం ఎలా ఏర్పడింది? తిరుమల వ్యవహారాలతో మీకేం పని? అంటూ ఆరా తీసినట్లు తెలుస్తోంది. అప్పన్న బ్యాంకు ఖాతాలో రూ. 4.69 కోట్లు ఎలా జమయ్యాయని ప్రశ్నించినట్లు టాక్. తిరుమలకు నెయ్యి సప్లై..ఆర్డర్స్..వాటితో వైవీ సుబ్బారెడ్డికి ఏమైనా ప్రమేయం ఉందా అని కూపీ లాగారాట. ఇక ఇప్పటికే అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డిని సిట్ విచారించింది. ఈ క్రమంలోనే వైవీ సుబ్బారెడ్డికి కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. అనారోగ్యంగా ఉన్నట్లు వైవీ.. అధికారులకు ఇన్ఫామ్ చేయడంతో..సిట్ అధికారులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికే వెళ్లి విచారించాలని నిర్ణయించారు. సిట్ విచారణలో వైవీ సుబ్బారెడ్డి ఏం చెప్పబోతున్నారు? ఆయన పీఏ చెప్పిన విషయాలపై సిట్ ఎలాంటి ప్రశ్నలు వేయనుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. సిట్ విచారణలో వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఉందని తేలితే మాత్రం ఈ కేసులో సంచలనాలు పక్కా. కల్తీ నెయ్యి వివాదంపై ఇప్పటికే కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. అయితే అటు పరకామణి కేసులో భూమన..ఇటు కల్తీ నెయ్యి కేసులో వైవీ సుబ్బారెడ్డి అలిగేషన్స్ ఎదుర్కొంటుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. పైగా ఈ ఇద్దరు నేతలు వైసీపీ అధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. ఈ ఇద్దరిని కార్నర్ చేసి..జగన్‌ను ఇరకాటంలో పెట్టేందుకు కూటమి స్కెచ్ వేస్తోందన్న టాక్ వినిపిస్తోంది. పరకామణి కేసు..ఇటు కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో రాబోయే రోజుల్లో ఎలాంటి డెవలప్‌మెంట్స్ ఉంటాయో చూడాలి.

# జగన్ కంచుకోటలో మౌనరాగం...



కడప నవంబర్ 20,

జగన్ సొంత ఇలాకా. ఒకప్పుడు వైసీపీదే హవా. గత ఎన్నికల నుంచి సీన్ మారిపోయింది. తొలి గడప కడపలో టీడీపీ సత్తా చాటుతూ వస్తోంది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ బై ఎలక్షన్‌లో కూడా వైసీపీ పట్టు నిలుపుకోలేకపోయింది. ఇక ఓటమి తర్వాత ఫ్యాన్ పార్టీ లీడర్లంతా గప్ చుప్ అయ్యారట. ఒకరిద్దరు నేతలు తప్ప..మిగతా లీడర్లు అంతా సైలెంట్‌గానే ఉండిపోతున్నారట. జగన్ కంచుకోటలో నేతల మౌనరాగమెందుకు? మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలను గాలికి వదిలేస్తే క్యాడర్ పరిస్థితి ఏంటివైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కడప. రాష్ట్రమంతా ఒకఎత్తు.. కడప మాత్రం జగన్‌కు చాలా స్పెషల్. ఎందుకంటే అది ఆయన రాజకీయ క్షేత్రం. తాతలు, తండ్రుల కాలం నుంచి ఆధిపత్యం చలాయించిన ప్రాంతం. అధికారం ఉన్నా లేకున్నా జగన్ ఫ్యామిలీ, ఆయన అనుచరవర్గం గుప్పెట్లోనే ఉండేది కడప జిల్లా. కానీ గత ఎన్నికల్లో పవర్ పోయినప్పటి నుంచి పరిస్థితి మారిపోయింది. 2024లో ఓటమి తర్వాత..ఒకరిద్దరు మినహా కడప జిల్లాలోని మిగతా వైసీపీ లీడర్లంతా సైలెంట్‌గా ఉండిపోతున్నారట. అపొజిషన్ పార్టీ నేతలు కావాలనే సైలెంట్‌గా ఉంటున్నారా? లేక ఇప్పుడు లైమ్‌లైట్‌లో ఉండొద్దనే మౌనంగా ఉండిపోతున్నారా అన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 2014 నుంచి 2019 వరకు కడప జిల్లాలో మెజార్టీ స్థానాలు వైసీపీ ఖాతాలోనే ఉండేవి. 2014 ఎన్నికల్లో ఒక్క రాజంపేట మినహా అన్నింటా వైసిపి గెలిచింది. ఇక 2019 లో జిల్లా అంతా ఫ్యాన్ పార్టీ క్లీన్ స్వీప్. 2024లో ఉమ్మడి కడప జిల్లాలో మూడు సీట్లు మాత్రమే గెలిచింది వైసీపీ. సొంత జిల్లాలో ఓటమి కంటే నేతలు తన వెంట నిలబడకపోవడం జగన్‌కు నచ్చడం లేదట. పవర్‌లో ఉన్నప్పుడు అన్నీ అనుభవించి అధికారం కోల్పోగానే జిల్లా నేతలు పార్టీని గాలికొదిలేశారని క్యాడర్ గగ్గోలు పెడుతోంది. నడిపించే నేతల కోసం నియోజకవర్గాల్లోని క్యాడర్ ఆశతో ఎదురుచూస్తున్నారట. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తోంది. అయినా వైసీపీ అలర్ట్ అవ్వట్లేదన్న ఆరోపణలు సొంత పార్టీలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ మధ్యే కడప జిల్లా అధ్యక్షుడిగా నియమించబడ్డ జగన్ మేనమామ రవీంద్రరెడ్డి, వెంపల్లి సతీష్ రెడ్డి మీడియాలో హడావుడికే సరిపోతున్నారట. ఇక కాంట్రవర్సీ కామెంట్స్‌తో అప్పుడప్పుడు ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి లైమ్‌లైట్‌లో ఉండే ప్లాన్ చేస్తున్నారట. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నా జమ్మలమడుగు వైసీపీ ఇంచార్జ్ ఎవరో తెగకపోవడంతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారట. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ తాను జగన్ దగ్గర ఎక్కువ కనిపిస్తూ సొంత పనులతో బిజీగా మారారని అంటున్నారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వయోభారంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి కబ్జా ఆరోపణలు ఫేస్ చేస్తూ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా యాక్టీవ్‌గా పని చేయాలనుకుంటున్నా లోకల్ పాలిటిక్స్ ఆమెకు హెడెక్‌గా మారాయట. ఇక రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఇద్దరూ జగన్‌కు మంచి ఫ్రెండ్స్. ఈ ఇద్దరు నేతలు ఔట్ ఆఫ్ స్టేషన్ అన్నట్లుగానే ఉంటున్నారట. ఇక పులివెందుల వ్యవహారాలు ఎంపీ అవినాశ్, జగన్ కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఒక్కో నేత తీరు ఒక్కో రకంగా ఉండటంతో జిల్లా క్యాడర్ అయోమయంలో పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్న టైమ్‌లో నేతలు మౌనంగా అధినేతకు భారంగా మారిందట. ఇలాగే కొనసాగితే రాబోయే స్థానిక ఎన్నికల్లో మరోమారు ఫ్యాన్ పార్టీ పేలవమైనా ప్రదర్శన ఖాయమని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారట. జిల్లాలో పార్టీని కాపాడాలని నేరుగా జగన్‌ను కలుస్తున్నారట లోకల్ లీడర్లు. కాస్త టైమ్ ప్లీజ్ అని జగన్ కార్యకర్తలను ఓదార్చే పని పెట్టుకున్నట్టు టాక్. లోకల్ దంగల్ స్టార్ట్ అయ్యేలోగా ఫ్యాన్‌కు రిపేర్ చేస్తారా లేదా చూడాలి.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తప్పదా

విశాఖపట్టణం నవంబర్ 20,

ఆంధ్రప్రదేశ్ లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మరోసారి తెరపైకి వస్తోంది. ఎన్ని వేల కోట్లు తెచ్చి పోసినా లాభాలు రాకుండా తెల్లఏనుగులా మారితే ఎంత కాలం అని భరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమవుతోంది. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ముగింపు సమయంలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ప్లాంట్‌ను 'వైట్ ఎలిఫెంట్' అని, ఉద్యోగులు 'ఇంట్లో కూర్చొని జీతాలు తీసుకుంటున్నారు' అని విమర్శించారు. "ప్రభుత్వం ఎప్పటికీ డబ్బు ఇస్తుందా? ఉద్యోగులు కష్టపడి పని చేసి లాభాలు తెచ్చి, ప్రైవేటీకరణకు అడ్డుకట్ట వేయాలి" అని అన్నారు. ఈ మాటలు ప్రైవేటీకరణకు ముందస్తు సంకేతమా అనే చర్చకు కారణమయ్యాయి. వైజాగ్ స్టీల్ ప్లాంట్ గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల్లో మునిగిపోయింది. 2024లో రూ.4,000 కోట్లు నష్టం వచ్చింది. కేంద్రం ఫిబ్రవరి 2025లో రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ప్రైవేటీకరణ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి ఆపేసింది. కేంద్రం రఇచ్?చన ప్యాకేజీతో ప్లాంట్ బతికిందని ఇక ప్రైవేటీకరణ లే లేనట్లేనన్నారు. కానీ ఆ తర్వాత కూడా స్టీల్ ప్లాంట్ పరిస్థితి మెరుగుపడలేదు. ఉద్యోగులు పని చేయడం లేదన్న నివేదికలు ఉండటంతోనే చంద్రబాబు ఇలా వ్యాఖ్యానించారని చెబుతున్నారు. ఆ అనుమానాలను నిజం చేస్తూ.. ఉత్పత్తి ఆధారితంగా జీతాలు చెల్లిస్తామన్న ఉత్తర్వులు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం జారీ చేసింది. నవంబర్ జీతాలు ప్రొడక్షన్ టార్గెట్‌లకు లింక్ చేశారు. ఇది ఉద్యోగుల్లో భయాన్ని మరింత పెంచింది. చంద్రబాబు ప్లాంట్‌ను ప్రొఫెషనల్‌గా నడపాలని కోరుతున్నారు. ఉద్యోగులు కష్టపడాలని చెప్పడం మేనేజ్‌మెంట్ సంస్కరణలకు సంకేతం అనుకోవచ్చు. కేంద్ర ప్యాకేజీతో ప్రైవేటీకరణ ఆగిపోయింది కానీ.. ఎలా ఎప్పటికీ గాడిన పడకుండా.. నష్టాలు వస్తూంటే..ఎప్పటికప్పుడు నిధులు తెచ్చి పూడుస్తారని అర్థం కాదని చంద్రబాబు నేరుగా చెబుతున్నారు. ప్రైవేటు కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తూంటే అన్ని వనరులు ఉండి కూడా ఎందుకు స్టీల్ ప్లాంట్ కు లాభాలు రావడం లేదని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారు. అయితే చంద్రబాబు మాటల్ని విపక్షాలు, యూనియన్లు దీన్ని 'ప్రైవేటీకరణకు మార్గం'గా చూస్తున్నాయి. ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ లేకపోవడం వల్లే నష్టాలు వస్తున్నాయని వారంటున్నారు. వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ ఉద్యోగులను తొలగించాలనే ప్లాన్ కూడా చేస్తున్నారని ఉద్యోగ సంఘాలు అనుమానిస్తున్నాయి. ప్లాంట్ లాభాల్లోకి వస్తే మాత్రమే ప్రైవేటీకరణ ఆగుతుందన్నట్లుగా చంద్రబాబు మాటలు ఉన్నాయి. అదే పనిగా నష్టాలు వస్తూంటే.. కేంద్రం కూడా నిధులు ఇవ్వదు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ లక్షన్నర కోట్లతో ప్లాంట్ పెట్టేందుకు ముందుకు వస్తోంది. ఆ కంపెనీ పూర్తి స్థాయి ప్రైవేటు కంపెనీ. ఆ కంపెనీ వస్తే విశాఖ స్టీల్ ప్లాంట్ కు మరిన్ని సమస్యలు వస్తాయని భావిస్తున్నారు.

# హ్యాపినెస్ట్ హోమ్ మళ్లీ ప్రారంభం

విజయవాడ, నవంబర్ 20,

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఐదేళ్లపాటు నిలిచిపోయిన మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్టు "హ్యాపీనెస్ట్"కు ముందడుగు పడింది. రాజధాని నిర్మాణంపై కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులు ఊపందుకోనున్నాయి. సీఆర్డీఏ అధికారులు ఇచ్చిన తాజా వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాలు వచ్చే సంవత్సరం జనవరి నుంచి జెట్ స్పీడ్‌లో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అక్టోబర్ 2025 నాటికే పైల్ ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి, మెయిన్ స్ట్రక్చర్ నిర్మాణానికి పునాదులు పడ్డాయి.హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు చరిత్రను పరిశీలిస్తే, 2017-18 కాలంలో ప్రకటించారు. అప్పట్లో మధ్యతరగతి ప్రజలకు అత్యంత అద్భుతమైన అవకాశం కావడంతో, ఈ ఫ్లాట్లు "హాట్ కేకుల్లా" అమ్ముడుపోయాయి. భారీగా దరఖాస్తుదారులు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూడా ఈ ఫ్లాట్లను సొంతం చేసుకోవడానికి ఉత్సాహపడ్డారు. అయితే, 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని స్థితిపై అనిశ్చితి నెలకొనడంతో ప్రాజెక్టు పూర్తిగా నిలిచిపోయింది. నాటి ప్రభుత్వం దరఖాస్తుదారుల సొమ్ము తిరిగి ఇచ్చేయాలని నిర్ణయం తీసుకుంది.

కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ మొదలు

2024 నవంబర్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పునరుజ్జీవనం పోసుకుంది. పాత ప్రాజెక్టును కొనసాగించాలని నిర్ణయం తీసుకున్న సీఆర్డీఏ... ఎన్‌సీసీ సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. దీంతో దరఖాస్తుదారుల ఆశలు మళ్లీ చిగురించాయి.




ప్రాజెక్టు పరిధి: వివరాలు ఏంటి?

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు దాదాపు 15 ఎకరాల (14.46 ఎకరాలు) విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. ఇది సుమారు ?930 కోట్ల నుంచి ?985 కోట్ల అంచనా వ్యయంతో కూడిన నిర్మాణం.

- మొత్తం టవర్లు: 12 టవర్లు.

- అంతస్తులు: ప్రతి టవర్‌లో జీ+18 అంతస్తులు (గ్రౌండ్ ఫ్లోర్ + 18 ఎత్తువైన అంతస్తులు). కొన్ని చోట్ల జీ+19 అంతస్తులుగా కూడా ఉన్నాయి.

-మొత్తం ఫ్లాట్లు: 1,200 ఫ్లాట్లు.

ఫ్లాట్‌ల రకాలు: సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్, ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి.

వివిధ బడ్జెట్‌లలో అందుబాటులో ధరలు

ఈ ప్రాజెక్టు విభిన్న బడ్జెట్‌ల వ్యక్తులకోసం ఏర్పాటు చేశారు. ధరల వివరాలను సీఆర్డీఏ స్పష్టం చేసింది:

ఫ్లాట్ రకం ధర రేంజ్నిర్మాణ వివరాలు

సింగిల్ బెడ్‌రూమ్ రూ.60 లక్షలు నుంచి నిర్ణయించాల్సి ఉంది

డబుల్ బెడ్‌రూమ్ రూ.80 లక్షలు నుంచి రూ.1 కోటీ వరకు నిర్ణయించాల్సి ఉంది

ట్రిపుల్ బెడ్‌రూమ్ రూ.1 కోటీ నుంచి రూ.1.30 కోటీ వరకు చదరపు అడుగుకు రూ.4,751 చొప్పున

ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లను చదరపు అడుగుకు రూ.4,751 చొప్పున విక్రయిస్తున్నారు. అమరావతి వంటి ప్రీమియం లొకేషన్‌లో, అందునా రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో, ఈ ధరలు స్థిరమైన నివాసాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. నిర్మాణ కార్యక్రమాలు కేవలం నివాసాలకే పరిమితం కాలేదు. వచ్చే సంవత్సరం మార్చి నాటికి సెక్రెటేరియట్, మంత్రుల కేబిన్‌లు, విభాగ కార్యాలయాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు.

- ఐఎస్ సీనియర్ అధికారుల టవర్‌లు వేగంగా నిర్మిస్తున్నారు.

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్యాంపు కార్యాలయాలు దాదాపు పూర్తయ్యాయి.

- జడ్జీ రెసిడెన్సెస్ కూడా పూర్తి కావస్తున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల తరలింపుతో, అమరావతిలో వెంటనే నివాసాల అవసరం పెరగడం ఖాయం. సరిగ్గా ఈ సమయంలోనే 1,200 హ్యాపీనెస్ట్ ఫ్లాట్‌ల నిర్మాణం "జెట్ స్పీడ్"లో పూర్తి చేసి అందించాలని ప్రభుత్వం చూస్తోంది.

## కామ్ గా మారిన గీత...

కాకినాడ, నవంబర్ 20,

వైసీపీ నేత వంగా గీత ఎందుకో యాక్టివ్ గా లేరు. ఫైర్ బ్రాండ్ గా ముద్రపడిన వంగా గీత ఇప్పుడు రాజకీయంగా కామ్ అయిపోయారు. గత ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అక్కడ పవన్ కల్యాణ్ బరిలో ఉండటంతో వంగా గీతను పిఠాపురం ప్రజలు ఆదరించలేదు. నాడు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తాము అధికారంలోకి వస్తే వంగా గీతను ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా చేస్తానని హామీ ఇచ్చినా వర్క్ అవుట్ కాలేదు. 2024 ఎన్నికల్లో దారుణ ఓటమి తర్వాత వంగా గీత పెద్దగా కనిపించడం లేదు. అప్పడప్పుడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మినహా పూర్తిస్థాయిలో యాక్టివ్ గా లేరన్నది వాస్తవం. 2019 ఎన్నికల్లో వంగా గీత కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఐదేళ్లు బాగానే ఉన్నారు. అయితే ఆమెకు పార్లమెంటు కంటే శాసనసభలోకి ప్రవేశించాలన్న మక్కువే ఎక్కువ ఉంది. జగన్ కూడా పిఠాపురం నియోజకవర్గం కేటాయించడంతో పవన్ కల్యాణ్ తో హోరా హోరీ పోరాడారు. కానీ అవతల ఉన్నది పవన్ కల్యాణ్ కావడం, ఆయన అభిమానులు,సామాజికవర్గం ఓటర్లు పవన్ కు పక్కాగా ఓటేయడంతో వంగా గీత దారుణంగా ఓటమి పాలయ్యారు. ఇక పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని తన అడ్డాగా మార్చుకున్నారు. ఆయన వచ్చే ప్రతి ఎన్నికల్లోనూ పిఠాపురం నుంచి బరిలోకి దిగుతారు.. పవన్ కల్యాణ్ పై పోటీ చేసి గెలుపొందడం కష్టమేనని భావిస్తున్న వంగా గీత తనకు వేరే నియోజకవర్గాన్ని అప్పగిస్తే బాగుంటుందన్నఅభిప్రాయంలో ఉన్నట్లు కనపడుతుంది. ఇక్కడ మళ్లీ పవన్ పై పోటీ చేసినా గెలుపు అనేది చాలా వరకూ కష్టమే కావడంతో ఆమె మరొక నియోజకవర్గానికి షిఫ్ట్ అవ్వాలని భావిస్తున్నారు. కానీ జగన్ నుంచి ఇప్పటి వరకూ దీనిపై క్లారిటీ రాకపోవడంతో వంగా గీత యాక్టివ్ గా లేరంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి తాను తప్పు చేశానా? అన్న అంతర్మధనంలో వంగా గీత ఉన్నట్లు తెలుస్తోంది. వంగా గీత పిఠాపురంలోనూ పెద్దగా యాక్టివ్ గా లేకపోవడానికి ఇదే ప్రధాన కారణమని చెబుతున్నారు.

## వాసిరెడ్డికి దారేదీ... మూసుకుపోయిన దారులు

విజయవాడ, నవంబర్ 20,

వైసీపీ నుంచి రాజీనామా చేసిన వారిని పార్టీలోకి తీసుకోవడానికి టీడీపీ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వైసీపీ అధికారం కోల్పోయిన వెంటనే మాజీ మహిళ కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. అయితే ఆమె ఇప్పటి వరకూ ఏ పార్టీలోనూ చేరలేదు. త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు వెంటనే ప్రకటించారు. గత ఏడాది డిసెంబరు నెలలో ఆమె రాజీనామా చేసినప్పటికీ ఇంత వరకూ టీడీపీలో వాసిరెడ్డి పద్మ టీడీపీలో చేరలేదు. డిసెంబరు నెలాఖరులోనే చేరాల్సిన వాసిరెడ్డి పద్మ టీడీపీ లో చేరలేకపోయారు. అయితే వాసిరెడ్డి పద్మ చేరికకు టీడీపీ నేతలు అభ్యంతరం పెద్దయెత్తున చెప్పారని తెలిసింది. వాసిరెడ్డి పద్మ మాటకారి. మంచి సబ్జెక్టు ఉన్న నేతగా పేరు. ప్రజారాజ్యం నుంచి ఆమె పార్టీకి అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ప్రజారాజ్యంలోనూ ఎక్కువ రోజులు ఉండలేదు. తర్వాత ఆమె వైసీపీలో చేరి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నారు. కానీ వైఎస్ జగన్ మహిళ కమిషన్ ఛైర్ పర్సన్ పదవి వరకే వాసిరెడ్డిని పరిమితం చేశారు. తనకు జగన్ అన్యాయం చేశారని, జగన్ తనకు చాలా బాకీ ఉన్నారని వాసిరెడ్డి పద్మ మీడియాతో పదే పదే చెబుతున్నారు. తాను పదిహేనేళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వలేదని వాసిరెడ్డి పద్మ వాదన. అందుకే తనకు వైసీపీ లో ఎదుగుదల లేదని భావించి తాను పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చానని చెబుతున్నారు. జగన్ తనకు రాజకీయంగా అన్యాయం చేశారని వాసిరెడ్డి పద్మ అంటున్నారు. అయితే వైసీపీ నేతలు మాత్రం కేబినెట్ హోదా ఇచ్చినా ఆమెకు అంతకు మించిన పదవి కావాలంటే ఎలా? అని వేచి ఉండాలి



కదా? అని అంటున్నారు.. కాపు సామాజికవర్గానికి చెందిన వాసిరెడ్డి పద్మ తొలుత జనసేనలో చేరాలనుకున్నారు. అయితే అప్పటికే జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరతారన్న ప్రచారంతో వాసిరెడ్డి పద్మ ఆ ఆలోచనను మానుకున్నారు. సామినేని జనసేనలో చేరడమే కాదు కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడయ్యారు. దీంతో ఆమె జనసేనలో చేరే ఛాన్స్ లేదు. అందువల్లనే ఆమె టీడీపీలో చేరేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేనిచిన్నిని కలిసి ఆయన ద్వారా పార్టీలో చేరాలని వాసిరెడ్డి భావించారు. మూడు సార్లు కేశినేని చిన్నితో వాసిరెడ్డి పద్మ సమావేశమయ్యారు. కేశినేని చిన్ని కూడా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో మాట్లాడివర్క్ అవుట్ కాలేదని తెలిసింది. మొత్తం మీద వాసిరెడ్డి పద్మ దాదాపు ఏడాదిన్నర కాలంగా రాజకీయంగా దూరంగానే ఉంటున్నారు. మరి ఏ పార్టీ కూడా దరిదాపుల్లో చేర్చుకోదేమోనన్న ఆందోళన ఆమెలో కనపడుతుంది

## భగ్గుమన్న బంగ్లాదేశ్

ఢాకా, నవంబర్ 20,

ఆగస్టులో బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల అంశం మంటలు రేపింది. భారీ ఉద్యమంతో అల్లకల్లోలం నెలకొంది. దీంతో ప్రజలు తిరుగుబాటుతో షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి దేశం వీడారు. తాజాగా మళ్లీ బంగ్లాదేశ్ మండుతోంది.

బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) విధించిన మరణశిక్ష దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపింది. ఆమె మద్దతుదారులు వీధులపైకి వచ్చి నిరసనలు ప్రారంభించడంతో ఢాకా సహా పలు నగరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనల్లో ఇద్దరు మరణించగా పలువురు గాయపడ్డారు. పోలీసులు నిరసనకారులను చెదరగొట్టేందుకు సౌండ్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్ వినియోగించాల్సి వచ్చింది. ధన్మొండి 32 ప్రాంతంలో హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ నివాసం సమీపంలో అల్లర్లు ఎక్కువయ్యాయన్న సమాచారం అధికారుల్యు ధ్రువీకరించారుహసీనా మద్దతుదారుల పార్టీ అవామీ లీగ్ ప్రభుత్వం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రెండు రోజుల బంద్ ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శులు ఈ చర్యను 'ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం'గా అభివర్ణించారు. మరోవైపు తాత్కాలిక ప్రభుత్వం నాయకుడు మహ్మద్ యూనస్ పోలీసులను, సైనిక బలగాలను సున్నిత ప్రాంతాల్లో మోహరించారు. వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. రవాణా నిలిచిపోయింది. ప్రజల్లో అసహనం పెరుగుతూ బంగ్లాదేశ్ మళ్లీ రాజకీయంగా అస్థిర దిశలో వెళ్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.విద్యార్థి నిరసనల నడుమ గత ఏడాది ఆగస్టులో షేక్ హసీనా పదవి వీడి భారత్ చేరిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆమె ఢిల్లీలోని రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. స్వదేశంలో ఆందోళనల సమయంలో హత్యలు, అణచివేత చర్యలకు ఆమెనే కారణమని ఐసీటీ అభియోగం మోపింది. హసీనా ఈ తీర్పును "పొలిటికల్ రివెంజ్"గా అభివర్ణిస్తూ ఖండించారు. 'ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ కుట్ర ఫలితమే ఈ తీర్పు,' అని ఆమె పేర్కొన్నారు. తన మద్దతుదారులను నిరాశ చెందవద్దని, ప్రజాస్వామ్యం పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.మాజీ ప్రధానికి మరణశిక్ష విధించడం బంగ్లాదేశ్ న్యాయ, రాజకీయ వ్యవస్థను రెండు భాగాలుగా విడదీసింది.

# బీహార్ లో చెరగని నితీష్ ముద్ర..



పాట్నా నవంబర్ 20,

బిహార్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన నితీష్ కుమార్ రాష్ట్ర రూపురేఖలను మార్చడమే కాకుండా సామాజిక, రాజకీయ నిర్మాణాన్ని కూడా బలోపేతం చేశారు. అందుకే ఈసారి కూడా ఆయన నాయకత్వంలో ఎన్డీఏ కూటమి 200 మార్కును దాటి అధికార పగ్గాలు చేబుడుతోంది. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం కలిగిన నితీష్ కుమార్ బిహార్‌లో ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణ స్వీకారం చేశారు.వ్యూహాత్మక ఎత్తుగడలు, రాజకీయ చతురతకు పేరుగాంచిన నితీష్ కుమార్ ప్రయాణం గురించి చూస్తే, 1977లో తొలిసారిగా నితీష్ కుమార్ హర్నౌత్ సీటు నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నితీష్ ఓడిపోయారు. ఆ తర్వాత 1980లో నితీష్ హర్నౌత్ సీటు నుంచి పోటీ చేసి మళ్లీ ఓడిపోయారు. ఆ తర్వాత 1985లో ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయాలకు స్వస్తి పలుకుతానని ప్రతిజ్ఞ చేశారు, కానీ విధి ఆయన్ని వెళ్లనీయలేదు. 1985లో ఆయన ఎమ్మెల్యే అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలుమార్లు ముఖ్యమంత్రి అయ్యారు. 1985లో నితీష్ కుమార్ నలందా జిల్లాలోని హర్నౌత్ నుంచి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. నాలుగేళ్ల తర్వాత ఆయన బార్ లోక్ సభ సీటును గెలుచుకుని జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వంలో ఆయనను కేంద్ర వ్యవసాయ, సహకార శాఖ సహాయ మంత్రిగా నియమించారు.1994లో ఆయన లాలూ ప్రసాద్ యాదవ్ నుంచి విడిపోయి తన సొంత మార్గాన్ని ఎంచుకున్నారు. అదే సంవత్సరం జార్జ్ ఫెర్నాండెస్‌తో కలిసి సమతా పార్టీని స్థాపించారు. 1996లో సమతా పార్టీ బీజేపీతో కలిసి కూటమిగా ఏర్పడి బిహార్‌లో 6 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది.నితీష్ కుమార్ 2000 సంవత్సరంలో కేవలం 7 రోజుల పాటు బిహార్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత 24 నవంబర్ 2005న తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. తన పదవీ కాలాన్ని పూర్తి చేశారు. 2013లో ఆయన బీజేపీతో 17 ఏళ్ల బంధాన్ని తెంచుకుని వేరే దారిని ఎంచుకున్నారు. ఈ సమయంలో ఆయన 11 మంది బీజేపీ మంత్రులను పదవుల నుంచి తొలగించారు. 2014లో లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ పేలవమైన పనితీరు కారణంగా పదవికి రాజీనామా చేశారు.2015లో ఆయన మహాకూటమిలో భాగస్వామ్యమై నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఈ పదవీకాలం స్వల్పకాలికంగానే ఉంది. ఆ తర్వాత నవంబర్ 20, 2015న ఆయన ఐదవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు, కానీ 2017 జూలైలో రాజకీయ సంక్షోభం కారణంగా రాజీనామా చేసి మహాకూటమి నుంచి వైదొలిగారు. ఆ తర్వాత అదే రోజున ఆయన ఎన్డీఏలో చేరారు. ముఖ్యమంత్రిగా ఆరోసారి ప్రమాణ స్వీకారం చేశారు. 2020లో ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో విజయం సాధించి ఏడోసారి నితీష్ ముఖ్యమంత్రి అయ్యారు.నితీష్ కుమార్ పదవీకాలంలో అనేక రాజకీయ పరిణామాలు కొనసాగాయి. ఆగస్టు 9, 2022న ఆయన మళ్లీ బీజేపీతో సంబంధాలు తెంచుకున్నారు. ఆయన మహాకూటమిలో భాగమయ్యారు. 8వ సారి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ప్రక్రియ ఆగలేదు. జనవరి 28, 2024న ఆయన కూటమి నుంచి వైదొలిగి మళ్లీ ఎన్డీఏలో చేరారు. 2025లో ఆయన నాయకత్వంలో ఎన్డీఏ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించింది. ఇది ఆయన పదవీ కాలంలోనే అతిపెద్ద విజయం. నితీష్ ప్రారంభంలో విద్యార్థి నాయకుడిగా జేపీ ఉద్యమంలో పాల్గొన్నారు.

నితీష్ కుమార్ మార్చి 1, 1951న బిహార్‌లోని పాట్నా జిల్లాలోని భక్తియార్‌పూర్‌లో జన్మించారు. ఆయన తండ్రి కవిరాజ్ రామ్ లఖన్ సింగ్ స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయుర్వేద వైద్యుడు. ఆయన తల్లి పేరు పరమేశ్వరి దేవి. ఫిబ్రవరి 22, 1973న మంజు కుమారి సిన్హాను వివాహం చేసుకున్నారు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నాడు, ఆయన పేరు నిశాంత్ కుమార్. నితీష్ కుమార్ భక్తియార్‌పూర్‌లోని గణేష్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత పాట్నాలోని బిహార్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి 1972లో ఇంజనీరింగ్ డిగ్రీని పొందారు. ఈ సమయంలో ఆయన విద్యుత్ బోర్డులో పనిచేశారు.నితీష్ కుమార్ 1994లో జార్జ్ ఫెర్నాండెస్‌తో కలిసి సమతా పార్టీని స్థాపించారు, కానీ 2004లో సమతా పార్టీని జేడీయూలో విలీనం చేశారు.

# సంగారెడ్డిలో అనాథ వృద్ధురాలికి అధికారుల అండ

## – జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి
## – వృద్ధ మహిళ ఆశ్రమానికి తరలింపు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 20 :

సంగారెడ్డి పట్టణం లోని 23వ వార్డులో నివాసం లేక ఒంటరిగా జీవిస్తున్న అనాథ వృద్ధ మహిళ పరిస్థితిని స్థానికులు జిల్లా అధికారులు దృష్టికి తీసుకొని రావడంతో, అధికారులు



వెంటనే స్పందించి వృద్ధ మహిళలకు ఆశ్రయం కల్పించారు. చలి తీవ్రత పెరుగుతున్న పరిస్థితుల్లో ఆమె ఆరోగ్యం ప్రమాదంలో పడకముందే చర్యలు తీసుకోవడం ప్రత్యేకంగా కొనియాడదగిన అంశం.

అధికారుల చర్యలు:

సంగారెడ్డి పట్టణంలోని 23వ వార్డులో వృద్ధ మహిళ పరిస్థితిని గమనించిన 23వ వార్డు మాజీ కౌన్సిలర్ కూన సంతోష్, టీ వై ఎస్ ఎస్ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ కూన వేణు ఈ విషయాన్ని మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు తెలియజేశారు. సమాచారం అందుకున్న జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, తక్షణ చర్యలకు ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్‌ను ఆదేశించారు.

వృద్ధ మహిళ ఆశ్రమానికి తరలింపు:

జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని ఆమె వివరాలు సేకరించిన తర్వాత, అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ నిర్వహిస్తున్న వృద్ధుల అనాథ ఆశ్రమానికి వృద్ధ మహిళను తరలించారు. అక్కడ మహిళకు అవసరమైన వైద్యం, భోజనం మరియు సంరక్షణ అందుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కూన సంతోష్, టీ వై ఎస్ ఎస్ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ కూన వేణు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఘన స్వాగతం.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 20 (భారత శక్తి): ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "జల సంచయ్ %-% జన భాగీదారి" అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్ కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కార్యాలయం ప్రధాన గేటు వద్ద అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. జిల్లాకు కోటి రూపాయల రివార్డు లభించడం విశేషమని తెలిపారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పని చేసి, జిల్లాకు మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# జై కిసాన్ – జై జవాన్ రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సీతక్క



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 20: గురువారం బిక్నూర్ మండలంలో మొత్తం రూ.92.80 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. బిక్నూర్ మండలం మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కాంప్లెక్స్ నిర్మాణ కార్యక్రమాలకు మంత్రి సీతక్క తోపాటు ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షట్కార్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, వివిధ ప్రజా ప్రతినిధులతో కలసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మార్కెటింగ్ కమిటీ కాంప్లెక్స్‌లో 11 షాపులు, మీటింగ్ హాల్, టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమని, రైతులు పండించే ప్రతీ పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తూ వారికి అండగా నిలుస్తుందని ఆన్నారు.

వ్యవసాయం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, అందుకే మార్కెట్ యార్డుల అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

# గీతంలో ఉల్లాసంగా కేక్ మిక్సింగ్ వేడుక

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 20:

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గురువారం ఉత్సాహభరితమైన, ఆనందకరమైన కేక్ మిక్సింగ్ వేడుకతో పండుగ సీజన్ ను స్వాగతించింది. క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ నేతృత్వంలో ఆతిథ్య విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమం, క్రిస్మస్ యొక్క వెచ్చదనం, స్ఫూర్తిని జరుపుకోవడానికి వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులందరినీ ఒకచోట చేర్చింది. ప్రపంచ వ్యాప్తంగా



గౌరవించబడే సంప్రదాయమైన కేక్ మిక్సింగ్ వేడుక ఆశ, ఆనందం, కొత్త ప్రారంభాలను సూచిస్తుంది. గీతంలో, ఈ వేడుక ఒక పాక శాస్త్ర ఆచారానికి మించి జరిగింది. ఎండిన పండ్లు, గింజలు (నట్స్), సుగంధ ద్రవ్యాలు, వివిధ రసాల ఉల్లాసమైన మిశ్రమంలో పాల్గొనడానికి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది చేతులు కలిపారు. కృతజ్ఞత, ఐక్యతను ప్రతిబింబించే గొప్ప పండుగ కేక్ లను తయారు చేయడానికి ఈ మిశ్రమాన్ని కొన్ని వారాల పాటు ఊరబెడతారు.

సమాజం, భావోద్వేగం, భాగస్వామ్యం యొక్క ఆనందాన్ని ఈ వేడుక సూచిస్తుంది' అని అంబికా ఫిలిప్ అభిప్రాయపడ్డారు. 'కేక్ అనేది ప్రేమతో తయారు చేసిన తినదగిన పదార్థం. ఐక్యత, స్నేహం, పండుగ ఉత్సాహాన్ని ఈ వేడుక ప్రతింబిస్తుంద'ని ఆమె అన్నారు. ఈ కేక్ మిక్సింగ్ వేడుక ద్వారా ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకలను అధికారికంగా ప్రారంభించినట్టయింది. ఈ కార్యక్రమంలో గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, డైరెక్టర్-స్కూల్ ఆఫ్ టెక్నాలజీ %ఒ% డీన్-కోర్ ఇంజనీరింగ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఆతిథ్య బృందంతో పాటు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తంమీద ఇది వేడుకల స్ఫూర్తిని పెంచడమే గాక, ఈ సీజన్ లోనే చిరస్మరణీయమైన కార్యక్రమంగా నిలిచిపోయింది.

# మొట్ట మొదటి సారిగా కామారెడ్డి జిల్లా నుండి చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 20: గురువారం కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలంలోని మార్కెట్ యార్డ్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మహిళల అభ్యున్నతినే లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "మహిళల ఉన్నతి %-% తెలంగాణ ప్రగతి" కార్యక్రమం లో భాగంగా ఈ పంపిణీ జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క , ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎంపి సురేష్ శత్కార్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, గ్రంథాలయ ఛైర్మెన్ చంద్రకాంత్ రెడ్డి, మార్కెటింగ్ ఛైర్మెన్ రాజు లతో కలసి మంత్రి సీతక్క ప్రత్యేకంగా మహిళలకు బొట్టు పెట్టి చీర సారెలను అందజేశారు. పండుగ సందడి నిండిన వాతావరణంలో మహిళలు హర్షాతిరేకాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక శ్రేయస్సు కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రతి మహిళ ఆనందంగా పండుగలను జరుపుకునేందుకు ఇందిరమ్మ చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు మరింత బలాన్ని ఇస్తాయని తెలిపారు. మహిళల సాధికారతపై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల సందర్భంగా మహిళలనుద్దేశించి మాట్లాడుతూ, "ఇందిరా గాంధీ స్ఫూర్తితో ప్రతి మహిళా 'ఉక్కు మహిళ'గా ఎదగాలి" అని అన్నారు.

మహిళల ధైర్యం, నాయకత్వం, పట్టుదల దేశాభివృద్ధికి కీలకమని, ఇందిరాగాంధీ చూపించిన ధైర్యసాహసాలు ఈ తరం మహిళలకు మార్గదర్శకమని ఆమె పేర్కొన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ%-%స్వయం సహాయక కార్యక్రమాలు మహిళలను మరింత శక్తివంతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సంకల్ప దిశగా సాగుతున్నదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నిన్న నవంబర్ 19 న కోటి మందికి కోటి చీరలు మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి అనే నినాదంతో చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నారని, వారిని ఇంకా బలోపేతం చేస్తూ ప్రభుత్వం అన్ని రకాలుగా అభివృద్ధి దిశగా ముందుకు వెళుతున్నదని తెలిపారు. బిక్నూరు మండల అభివృద్ధికి తనవంతుగా తోడ్పడతానని ఆన్నారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని షెడ్యూల్ ఖరారు చేసి, ప్రతీ ఇంటికీ వెళ్లి బొట్టు పెట్టి చీర సారె అందించడం జరుగుతుందని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

నియోజక వర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, డిసెంబర్ 9 వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, పారదర్శకంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి అయ్యప్పస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

కరీంనగర్, నవంబర్ 20(భారతశక్తి ప్రతినిధి):

తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ లో (ఎల్ ఎం డి)లో నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు శుక్రవారం నుండి ప్రారంభమవుతాయని దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. నవంబర్ 21, 22 23 వ తేదీ ల్లో దేవాలయ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు , పూజ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. దేవాలయ స్థాపనలో భాగంగా శ్రీ శ్రీ హరి హరపుత్ర ధర్మశాస్తా




(అయ్యప్పస్వామి), గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, పార్వతీదేవి, నవగ్రహ దేవత విగ్రహాల ప్రతిష్ట లతోపాటు శిఖరధ్వజ , మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి కరకమలములతో యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహా కుంభాభిషేక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలకు హాజరయ్యే సమస్త భక్తులు, అయ్యప్ప స్వాములకు ఏలాంటి అసౌకర్యం , ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు చేపట్టినట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. హిందూ బంధువులు, అయ్యప్ప భక్తులు ప్రతి ఒక్కరూ ఇట్టి దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవ వేడుకల్లో పాల్గొని , శ్రీఅయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

# పోర్జరీ సంతకాలతో నా ఇల్లును జూనియర్ అసిస్టెంట్ కబ్జా.

## -రెవెన్యూ ఉద్యోగి పై చర్యలు తీసుకోవాలని భాదితుడు రాజగట్టు డిమాండ్.

జయశంకర్ భూపాలపల్లి (భారత శక్తి అక్టోబర్ 20): గురువారం భూపాలపల్లి కారల్ మర్క్స కాలనీ లో తనకు ఉన్న 350 గజాలు,అందులో ఉన్న పెంకుటిల్లును మొగుళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వీధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ వేమా లక్ష్మణ్ పోర్జరీ సంతకాలతో మున్సిపాలిటీలో నమోదు చేసుకున్నాడని మూగ.రాజాగట్టు అనే బాధితుడు విలేకరుల సమావేశంలో తెలిపాడు.ఈ విషయంగా జిల్లా కలెక్టర్,మున్సిపల్ కమిషనర్ కు ఆదరాలతో ఎన్నిసార్లు పిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.అంతేకాక ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటూ తమను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.అదే అదే విధంగా తాను 2000 సంవత్సరంలో భూపాలపల్లికి చెందిన వెలిశెట్టి రాజయ్య తనకు శేఖర్ వద్ద నుండి అట్టి ఇల్లును భూమిని కొని ఇచ్చాడని పేర్కొన్నారు.ఆ క్రమంలో స్టాంపు కాగితంతో పాటు వెలిశెట్టి రాజయ్య,ముద్ధసాని రాజయ్య,చిలకని నరసింగములు సాక్షులుగా ఉన్నారు.2000-2004 వరకు ఆ ఇంటిలో నివాసం ఉండి తన పేరు మీద గ్రామపంచాయతీ నెంబర్,నల్లాను తీసుకున్నట్లు పేర్కొన్నారు.అనంతరం తనకు బంధువుగా ఉన్న లక్ష్మణ్ వద్ద కొంత అప్పుగా తీసుకున్నానని,ఆ తర్వాత వడ్డీతో సహా చెల్లించడం జరిగిందాన్నారు.ఆదేవిధంగా 2004 నుండి తాను ఆర్టీసీ లో ఉ ద్యోగ రీత్యా మంథని లో సిగేసుకుంటున్నాను.ఆలాగే సదరు ఉ ద్యోగి భూపాలపల్లి ఆర్డీవో కార్యాలయంలో విధులు



నిర్వహిస్తున్నప్పుడు తన పలుకుబడితో మున్సిపల్ కార్యాలయంలో నా ఇల్లు ను విక్రయించినట్లు దొంగ కాగితాలు సృష్టించి మున్సిపల్ లో ఆన్లైన్లో ఇంటిని చేర్చుకున్నాడని వాపోయారు.ఈ విషయంగా పలుమార్లు లక్ష్మణ్ తో మాట్లాడితే నీకు ఇల్లు ఎక్కడిది అది నాదే అంటూ నా పైనే కేసులు పెట్టుదు భయాందోళనకు గురి చేశాడని అన్నారు.తప్పుడు పత్రాలతో నా ఇంటిని కబ్జా చేసిన రెవెన్యూ ఉ ద్యోగి లక్ష్మణ్ పై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని,నాకు తగిన న్యాయం చేయాలని బాధితుడు రాజగట్టు డిమాండ్ చేశారు.తమ సంతకాలను ఫోర్జరీ చేశాడు.భూపాలపల్లి కారల్మార్క్స కాలనీలో రాజగట్టు కు చెందిన ఇల్లు విక్రయంలో ఉన్న తమ సంతకాలను రెవెన్యూ ఉద్యోగి వేమ లక్ష్మణ్ ఫోర్జరీ చేశారని సాక్షులు ముద్దసాని రాజయ్య వెలిశెట్టి రాజయ్య చిలుకాని నర్సింగంలు పేర్కొన్నారు.భూపాలపల్లి లో శేఖర్ అయ్యర్ నుండి 2000 సంవత్సరంలో రాజకట్టు అతనికి తాను ఇంటిని స్థలమును కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందని సాక్షులు వెలిశెట్టి.రాజయ్య పేర్కొన్నారు.2000 సంవత్సరం నుండి తన ఇంటిలో ఉంటూ గ్రామపంచాయతీ ఇంటి నెంబర్ తో పాటు నల్లని తీసుకున్నాడు.రెవెన్యూ శాఖలో పనిచేసే వేమా లక్ష్మణ్ కావాలని తమ సంతకాలను పూజలు చేసి విక్రయించినట్లు మున్సిపల్ కార్యాలయంలో అధికారుల అండదండలతో తన పేరుపైన ఇల్లు చేసుకోవడం అన్యాయమని అన్నారు. అక్రమంగా తాము లేకున్నా సాక్షులుగా తమ పేర్లను పూజలు చేసిన రెవెన్యూ ఉద్యోగిపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సాక్షులు తెలిపారు.ఈ విషయంలో ఎలాంటి తాత్సారం చేయకుండా వెంటనే బాధితుడి రాజగట్టుకు న్యాయం చేయాలని వారిని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# నూతన సిఐని కలిసిన బిఆర్ఎస్ యువ నాయకులు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 20 :



సంగారెడ్డిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ రాము నాయుడు ను సంగారెడ్డి బీఆర్ఎస్ యువ నాయకులు శ్రవణ్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకు పూలగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గంలోని శాంతి భద్రతా పరిరక్షణకు పోలీసులు చేస్తున్న సేవలను అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై సంక్షిప్తంగా చర్చించిన నాయకులు, నూతన సీఐ నాయకత్వంలో చట్టం-శాంతి నిర్వహణ మరింత బలోపేతం అవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు.సీఐ ను కలసిన వారిలో వాజీద్, దిలీప్ కరీముద్దీన్, అదనాన్, సాబీల్ తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి: రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

## జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్

రాజన్న సిరిసిల్ల,నవంబర్ 20 (భారత శక్తి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతల అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ శర్ఫుద్దిన్, డిప్యూటీ జడ్పీ సీఈవో గీత తదితరులు పాల్గొన్నారు.



# %నూతన అక్రిడిటేషన్ ల రిజిస్ట్రేషన్ దరఖాస్తులకు ఆహ్వానం:జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బి పద్మజ

కడప, భరతశక్తి ప్రతినిధి, నవంబర్ 20: 2026-27 సం. సంబందించి జిల్లాలో అర్హత కలిగి వున్న వర్కింగ్ జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ల కొరకు ఆన్ లైన్ వెబ్ సైట్ %ష్ట్రజూం:// ఎవఎఖుతీవశ్రీఫ్ఆశీఅం.ఖజూ.స్త్రశీజ.ఱఅ% ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆన్లైన్ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని మొదటి దశలో పాత్రికేయులు పై ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా తమ పేరు, డెసిగ్నేషన్, ఈమెయిల్ అడ్రస్,ఆధార్ నెంబరు,పాస్వర్డ్, ఫోన్ నెంబర్ నమోదు చేసి ఓటిపి ఎంటర్ చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.తదుపరి రెండవ దశలో పాత్రికేయులు ఫోన్ నెంబరు, పాస్వర్డ్ తో లాగిన్ అయ్యి తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.లిఆ తదుపరి అప్లోడ్ చేసిన సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్ డ్రైవ్ లో పొందుపరిచి మరియు జిరాక్స్ కాపీలను, దరఖాస్తు ప్రతిని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, కార్యాలయంలో అందజేయాలనీ తెలిపారు.జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మీడియా మిత్రులకు కోరడమైనదనీ ఆ ప్రకటనలో తెలిపారు.ముఖ్య గమనిక:రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన ఈమెయిల్ అడ్రస్, ఫోన్ నెంబరు, పాస్వర్డ్ తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని కోరారు.

# యశోద హాస్పిటల్ లో ఏడేళ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స :డాక్టర్ సాగరి గుల్లపల్లి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 20:

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో డాక్టర్ సాగరి గొల్లపల్లి ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ లో జరిగిన అరుదైన ఆపరేషన్ వివరాలను బాలుడు ధర్మారెడ్డి తండ్రి భరత్ రెడ్డి తో కలిసి మీడియా




సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాగరి మాట్లాడుతూ చిన్నప్పటినుండి హెచ్ఐఎఫ్సి తో బాధపడుతున్న ఏడేళ్ల బాలుడు కపిల్ రెడ్డి ధర్మారెడ్డికి విజయవంతంగా చికిత్స అందించామని అయితే బాలుడు గత కొంతకాలంగా మూడు యాంటీ ఎపిలెప్టిక్ మందులు వాడుతున్నప్పటికీ ఆ బాలుడు తల మరియు బాలుడు తల మరియు కళ్ళలోటానిక్ డివిషన్ లక్షణాలను అనుభవిస్తున్నాడని దానికి తోడు కొంత సమయం స్పృహ కోల్పోతున్నారని తెలిపారు. న్యూరోలాజికల్ పరీక్షల తర్వాత వైద్య బృందం శస్త్ర చికిత్సను అందించాలని కోరగా ఫిబ్రవరి 21 పేషెంట్ కు శస్త్ర చికిత్స నిర్వహించారు. అనంతరం బాలుడు పూర్తిగా కోలుకోవడం సజావుగా జరిగిందని ఆరోగ్యకరమైన స్థితిలో డిశ్చార్జ్ చేశామని తెలిపారు. యశోద హాస్పిటల్ లో పీడియాట్రిక్ మరియు పెద్దలకు మూర్ఛ సమస్యకు చికిత్స చికిత్స అందిస్తున్నామని, అదునాతిక న్యూరో ఇమేజింగ్ న్యూరో సర్జికల్ విధానాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## -సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల ధర్నా

గుమ్మడిదల, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 20:



మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో నేడు గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్ కి మెమోరండం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. వచ్చే పదహారువేల600 వేతనం సరిపోవడం లేదని అన్నారు. మున్సిపల్ ఏర్పడి 11 నెలలు పూర్తవుతున్న నేటి వరకు యూనిఫామ్ లు చెల్లించలేదని అన్నారు. పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించిన ఏ ఒక్క కార్మికునికి ఉపయోగపడడం లేదని అన్నారు. విధి నిర్వహణలో కార్మికునికి కాలు విరిగితే ఏ ఒక్క అధికారి నేటి వరకు పట్టించుకోలేదని అన్నారు. అందుకోసం మున్సిపల్ అధికారులు ప్రతి కార్మికునికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. గ్రామపంచాయతీ ఉన్న కాలం నుండి మున్సిపల్ వరకు విధులు నిర్వహిస్తున్నారని, అందుకోసం అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్బులు, నూనెలు బెల్లం, ప్రతి సంవత్సరం ఇచ్చే రైన్ కోట్సమయానికి ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని బడ్జెట్లో తగిన నిధులు కేటాయించకపోవడంతో, అనేక సమస్యలు పెండింగ్లోనే ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రవీందర్, గుమ్మడిదల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, కోశాధికారి వీరేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌస్, ప్రధాన కార్యదర్శి మహేష్, సలహాదారులు రమేష్, లింగమ్మ, కిషన్ అమ్మ, కవిత, చంద్రయ్యలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి: రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 20( భారత శక్తి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికల సమాయత్తాలపై గురువారం ఆమె హైదరాబాద్లోని తన కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి శాఖ పెద్దపీట వేశాలన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, రిజర్వేషన్ల కేటాయింపు, శాంతిభద్రతల బందోబస్తు వంటి అంశాలపై అధికారులు ఒకటికి రెండుసార్లు పరిశీలనలు చేయాల్సిన అవసరాన్ని ఆమె గుర్తుచేశారు. ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించే దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు పని చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితాను వెంటనే పంపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు యథావిధిగా కొనసాగుతున్నాయని, అధికారులు ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ ఎటువంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, పంచాయతీ రాజ్, పోలీసు, రెవెన్యూ శాఖలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టు ఫోరం గౌరవ అధ్యక్షులుగా మంత్రి వివేక్ వెంకటస్వామి

## దళిత జర్నలిస్టు ఫోరం సభ్యులకు తన సంపూర్ణ మద్దతు గడ్డం వివేక్ వెంకటస్వామి కార్మిక, మైనింగ్ శాఖ, జియాలజీ శాఖ మంత్రి




హైదరాబాద్, నవంబర్ 20 ( భారత శక్తి):దళిత జర్నలిస్టు ఫోరం గత పదేళ్లలో జర్నలిస్టుల హక్కుల కొరకై ఎంతో పోరాటం చేశామని, దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ అన్నారు. దళిత జర్నలిస్ట్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కార్మిక, మైనింగ్ శాఖ, మరియు జియాలజీ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు, దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దళిత జర్నలిస్టు ఫోరం సభ్యుల డిమాండ్స్ ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారి సమస్యలను పరిష్కరిస్తారని, ఫోరం సభ్యులకు తను ఎల్లవేళలా సహకరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం తెలుగు రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి, మీసాల ఎల్లేష్, శ్రీకాంత్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు దొమ్మాట శివకుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాపాక విజయ రాజు, పెద్దిగారి స్వామి రాష్ట్ర కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# పంటల కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 20 (భారతశక్తి):జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంటల కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించి కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 14,760.56 క్వింటాళ్ల వరి ధాన్యం, 5,746 క్వింటాళ్ల సోయా, 7,715 క్వింటాళ్ల మొక్కజొన్న, 66,140 క్వింటాళ్ల పత్తి పంటను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తగు తేమ శాతం వచ్చిన తరువాతే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుందని తెలిపారు. 7 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చిన రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ అధికారుల ద్వారా నమోదు చేయించి, పంట ఉత్పత్తి పరిశీలన చేపట్టించుకోవాలన్నారు. ఆ వివరాలను కొనుగోలు కేంద్రాలకు అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో

మొత్తం 351 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వంద శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తిచేయాలని, ప్రతీ కేంద్రంలో ప్యాడి క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంటల కొనుగోలులో రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పత్తి రైతుల సౌకర్యార్థం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబరు, 88972 81111 వాట్సాప్ నెంబర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి గజానంద్‌తో పాటు సిసిఐ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భీమేశ్వర ఆలయాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ ఆది

## ఆలయ భద్రతను బలోపేతం చేయడానికి ఏర్పాట్లు



వేములవాడ, నవంబర్ 20 (భారత శక్తి) : వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలు, 15 హ్యాండ్ మెటల్ డిటెక్టర్లు, 5 డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ప్రభుత్వ విప్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. భక్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యవేక్షణలో వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈ రామకృష్ణారావు, ఆలయ ఏఈఓలు బ్రహ్మంగారి శ్రీనివాస్, జయకుమారి, జి. అశోక్ కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, శ్రీకాంతాచార్యులు, ఇతర ఆలయ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి



మహబూబాబాద్ జిల్లా ప్రతి నిధి, నవంబర్ 20(భారత్ శక్తి):గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి అన్నారు. గురువారం58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలి ముగింపు వేడుకలను పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా విద్యాధికారి దక్షిణామూర్తి మాట్లాడుతూ ప్రజలలో సామాజిక రాజకీయ వైజ్ఞానిక చైతన్యాన్ని తీసుకురావడంలో గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుచున్నవి . స్వాతంత్ర ఉద్యమంలోనే కాకుండాఅనేక ఉద్యమాలకు గ్రంథాలయాలు వేదికగా ప్రధాన పాత్ర పోషించినవి. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు పుస్తక పఠనం అనేది చాలా మెరుగైన పరిష్కార మార్గమని అన్నారు. ఓ మంచి పుస్తకం ఓ మంచి మిత్రులతో సమానం పుస్తకానికి మిత్రునికి అంతటి సాపత్యముంది, సన్నిహిత్యం ఉంది సాహితీ బంధం ఉంది, మంచి మిత్రుడు అన్నవాడు స్నేహితుని అపకారం తలపెట్టడు, అలాగే పుస్తకం కూడా కీడు చేయదు ,విలువల నేర్పిస్తుంది మార్గదర్శకంగా ఉంటుంది అన్నారు. విద్యార్థి దశలో చదివే పుస్తకాలే జీవితాన్ని నడిపిస్తాయని పిల్లలలో పెద్దలలో ప్రజానీకం అందరిలో పుస్తక పఠనం ఒక వ్యసనం గా మారాలని అన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా మోక్షం గుండం విశ్వేశ్వరయ్య ట్రస్ట్ చైర్మన్ షేక్ జానీ 6కుర్చీలు, గ్రంథాలయ పాఠకుడు సాయికిరణ్ 3 కుర్చీలు ,ప్రకాష్ ఎలక్ట్రికల్ వీరన్న 4కుర్చీలు , గ్రంథాలయానికి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత ,జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, మోక్షం గుండం విశ్వేశ్వరయ్య ట్రస్ట్ చైర్మన్ షేక్ జానీ, రిటైర్ లైబ్రేరియన్ గూడ నరేందర్, గ్రంథ పాలకులు జి విజేందర్ సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్, బొడ్డుపల్లి భూలక్ష్మి భోగి యాదమ్మ, పుస్తక ప్రియుడు అబ్బ గాని భాస్కర్ , జంపాల నారాయణ , తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో మైనింగ్, క్వారీ లీజులు క్రొత్తవి, రెన్యువల్ మంజూరు కోసం రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అనుమతి తప్పనిసరి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 20: కామారెడ్డి జిల్లాలో మైనింగ్, క్వారీ లీజులు క్రొత్తవి, రెన్యువల్ మంజూరు కోసం రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అనుమతి తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతికి అత్యంత ఆవశ్యకమైన జిల్లా సర్వే నివేదికను పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ , సుప్రీమ్ కోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లా సర్వే నివేదికను ప్రజా అభిప్రాయం కోసం జిల్లా వెబ్ సైట్లో %ట్ర్ జూం:// ఝఝతీవసనవ్.వశ్రీఖఅస్త్రుఅఖ.స్త్రశీజ.ఱఅ/%పొందుపర్చినట్లు తెలిపారు. ఈ డ్రాఫ్ట్ జిల్లా సర్వే నివేదిక పై అభిప్రాయాలను జిల్లా మైనింగ్ కార్యాలయమునకు ఈ నెల 21 తేదీ లోపు పంపగలరని తెలిపారు.

# రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆన్లైన్ క్రైమ్ రివ్యూ మీటింగ్







ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 20 (భారత శక్తి):2025 సంవత్సరం జనవరి నుండి సెప్టెంబర్ వరకు నెలల క్రైమ్ రివ్యూ మీటింగ్ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఈరోజు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడింది.

ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నేర పరిస్థితులు, కేసుల విచారణ పురోగతి, శాంతి భద్రతా చర్యలు, మహిళా–శిశు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ వంటి ముఖ్య అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, హాజరై, జిల్లా నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తుల పురోగతి మరియు నేర నియంత్రణ కోసం చేపడుతున్న చర్యల వివరాలను సమర్పించారు.

డీజీపీ గారు జిల్లాల వారీగా పనితీరును పరిశీలించి, దర్యాప్తుల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. మాట్లాడుతూ.. ముధోల్ మరియు బాసర ప్రాంతాల్లో కూడా రాత్రి పెట్రోలింగ్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల భద్రత మా ప్రాధాన్యం అని పేర్కొంటూ, ఎలాంటి నేరాలకు తావులేకుండా నిర్మల్ పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలను అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.” ఈ ఆన్లైన్ క్రైమ్ రివ్యూ మీటింగులో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల. తో పాటు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ , భైంసా పట్టణ ఇన్స్పెక్టర్ గోపీనాథ్. మరియు సబ్ ఇన్స్పెక్టర్లు పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

–అభివృద్ధి పనుల పురోగతి, అంశాలపై అధికారులతో సమీక్ష.
–హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.




వేములవాడ, నవంబర్ 20 (భారత శక్తి) : జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. వేములవాడ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్, రహదారులు,భవనాలు,పంచాయితీ రాజ్, గృహనిర్మాణ, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులతో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం సమీక్ష నిర్వహించారు. లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి, సరఫరాలో ఇబ్బందులు దూరం చేసేందుకు వేములవాడ నియోజకవర్గానికి 220/11, 133/11 ఒక్కొకటి 33/11 (11) సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయని విప్ వెల్లడించారు. ఆయా సబ్ స్టేషన్ల పురోగతి పై ఆరా తీశారు. రైతు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి 50 ఎకరాల భూమి గుర్తించాలని, తాత్కాలిక భవనం కేటాయించాలని సూచించారు. ఈ భవనాలను సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే 10 కోట్ల రూపాయలు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేయడం జరిగిందని, సామాజిక భవనాలు, తదితర వాటికి ఈ నిధులను కేటాయించడం జరిగిందని వివరించారు. 15 కోట్ల రూపాయలను పంచాయితీ రాజ్ శాఖ ద్వారా మంజూరు చేయించి, పనుల జాతర కార్యక్రమం చేపట్టడం జరిగింది. పనుల జాతరలో భాగంగా గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, మొదలైన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన పనుల పురోగతిపై ఆరా తీశారు. బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పనులు ప్రారంభం కాకుండా ఉన్న వాటిని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని రహదారి నిర్మించే ప్రదేశాల్లో వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించి, రహదారులు నిర్మించాలని ఆదేశించారు. మూలవాగు వంతెన నిర్మాణం కోసం 6 కోట్ల 90 లక్షల రూపాయలు భూసేకరణ కోసం కేటాయించడం జరిగిందని, అవసరమైన భూసేకరణ చేసి, పనులు ప్రారంభించి, పనులు వేగవంతం చేయాలని, వచ్చే వర్షాకాలంలో లోగా వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 10 చెరువుల పనులు మొదలు కాగా, 7 పూర్తి అయ్యాయని, మర్రిపెల్లి, లచ్చపేట, కలికోట సూరమ్మ ప్రాజెక్టుల పనులు పురోగతిలో ఉన్నాయని ఈఈ తెలిపారు. తక్కువ బడ్జెట్ తో ఎక్కువ ఎకరాల భూమి సాగులోకి తీసుకు వచ్చేందుకు రూ. 325 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, పనులు పూర్తి చేస్తే 45 వేల ఎకరాల భూములకు సాగులోకి వస్తాయని విప్ వెల్లడించారు. మల్కపేట ప్రాజెక్ట్ కోసం కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి మొత్తం 700 ఎకరాల భూమి అవసరమని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తెలిపారు. వాటి కోసం పూర్తి ప్రతిపాదనలు పంపాలని విప్ సూచించారు. అనంతరం వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని గృహ నిర్మాణ శాఖ అధికారులు వివరించారు. వేములవాడ రాజన్న ఆలయం ద్వారా ప్రతి ఏడాది రూ. 186 కోట్ల ఆదాయం వస్తుందని, అదే స్థాయిలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు గత ఏడాది సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇదేరోజు నవంబర్ 20 వ తేదీ 2024న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 150 కోట్ల ఆలయ విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భీమేశ్వర ఆలయంలో రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. మిషన్ భగీరథలో భాగంగా త్రాగునీరు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అగ్రహారంలో ఉన్న మిషన్ భగీరథ గ్రిడ్ ప్లాంట్ నిర్వహణపై ఆరా తీశారు. మధ్య మానేరు నిర్వాసితులకు పట్టాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని, ఆలయాలు, కుల సంఘాల భవనాలకు పరిహారం ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సూచించారు. వట్టిమల్ల, నిమ్మపల్లి వద్ద ఇసుక రీచ్ లు ఏర్పాటు చేయాలని విప్ కోరారు. రుద్రంగికి 42 కోట్లతో ఏటీసీ మంజూరు అయిందని, నియోజకవర్గానికి 20 వేల మెట్రిక్ టన్నుల గోదాములు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభావవంతంగా అమలు చేసి, ప్రజలకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, సమష్టి విజయం కోసం కృషి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఆయా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వివిధ అభివృద్ధి పనులకు స్థలాలు వెంటనే గుర్తించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రూపాయికి టార్గెట్లు పెట్టుకోలేదు



దిల్లీ: రూపాయి విలువకు సంబంధించి తాము ఎలాంటి నిర్దేశిత స్థాయిలను నిర్ణయించుకోలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడమే రూపాయి విలువ పతనానికి కారణమన్నారు. దేశంలో సరిపడా విదేశీ మారక నిల్వలున్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. దిల్లీ స్కూల్ ఆఫ్ ఎనకమిక్స్‌లో జరిగిన కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వం తీసుకురావడం ఆర్‌బీఐ లక్ష్యమని సంజయ్ మల్హోత్రా వివరించారు. అవసరమైన రక్షణ చర్యలు చేపడుతూ.. నిబంధనలను మరింత సరళతరం చేయడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా డాలరుతో రూపాయి విలువ పతనం గురించి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. అమెరికాతో త్వరలో 'మంచి వాణిజ్య ఒప్పందం' కుదరబోతోందని, తద్వారా దేశ కరెంట్ ఖాతా లోటుపై ఒత్తిడి తగ్గుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. వాణిజ్యం, అమెరికా టారిఫ్‌ల కారణంగా ఇటీవల రూపాయి ఒత్తిడికి ఎదుర్కొందన్నారు. డాలరుతో రూపాయి మారకం విలువ గురువారం 88.71గా ఉంది. ''రూపాయి విలువకు సంబంధించి మేమేమీ టార్గెట్లు నిర్దేశించుకోలేదు. డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి విలువ పతనమవుతుంది. డాలర్‌కు డిమాండ్ తగ్గినప్పుడు రూపాయి విలువ పెరుగుతుంది. డాలర్ విలువల్లో హెచ్చుతగ్గులు రూపాయి విలువను ప్రభావితం చేస్తుంటాయి'' అని మల్హోత్రా అన్నారు. బ్యాంకింగ్ రంగంపై అడిగిన మరో ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. భారతీయ బ్యాంకులు మెరుగైన పనితీరును కనబరుస్తున్నాయన్నారు. ప్రపంచంలోనే టాప్100 బ్యాంకుల జాబితాలో త్వరలో కొన్ని బ్యాంకులు చేరబోతున్నాయని మల్హోత్రా అన్నారు.

## 'డార్క్ ప్యాటర్న్స్'కు
# 26 ఇకామర్స్ సంస్థలు గుడ్‌బై

దిల్లీ: దేశంలోని 26 ప్రముఖ ఇకామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్స్‌లో డార్క్ ప్యాటర్న్స్ లేవని స్వయంగా ప్రకటించాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జెప్టో, జొమాటో, స్విగ్గీ, జియోమార్ట్, బిగ్‌బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్స్ ఇందులో ఉన్నాయని తెలిపింది. డిజిటల్ మార్కెట్‌లో వినియోగదారుల హక్కుల రక్షణలో ఇదో కీలక ముందడుగుగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అభివర్ణించింది. 'డార్క్ ప్యాటర్న్స్ ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్' మార్గదర్శకాలు 2023కు అనుగుణంగా తమ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నట్లు ఈ సంస్థలు స్వీయ ప్రకటనలు సమర్పించాయి. వినియోగదారులను తప్పుదారి పట్టించే, మోసపూరిత ఆన్‌లైన్ డిజైన్ పద్ధతులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో సంబంధిత సంస్థలు అంతర్గతంగా లేదా థర్డ్ పార్టీలతో ఆడిట్ నిర్వహించి డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి తొలగించాయి. డార్క్‌ప్యాటర్న్స్ ఏవీ తమ ప్లాట్‌ఫారాల్లో లేవని ఈ 26 సంస్థలు ప్రకటించాయని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (CCPA) తెలిపింది. ఫాల్స్ అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, ఫోర్స్డ్ యాక్షన్, సబ్‌స్క్రిప్షన్ ట్రాప్, ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్, బైట్ & స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్‌గైజ్డ్ అడ్వర్టైజ్‌మెంట్స్, నాగింగ్, ట్రిక్ వర్డింగ్, సాస్ బిల్లింగ్, రోగ్ మాల్వేర్స్ వంటివి డార్క్‌ప్యాటర్న్స్‌గా పేర్కొంటారు.



**ఆ సంస్థలు ఇవే..**

ఫార్మ్‌ఈజీ, జెప్టో మార్కెట్ ప్లేస్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా, వాల్‌మార్ట్ ఇండియా, మేక్‌మైట్రిప్, బిగ్‌బాస్కెట్, జియోమార్ట్, జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, పేజ్ ఇండస్ట్రీస్, విలియమ్ పెన్, క్లియర్‌ట్రిప్, రిలయన్స్ జ్యువెల్స్, రిలయన్స్ డిజిటల్, నెట్‌మెడ్స్, టాటా 1ఎంజీ, మీషో, ఇక్సిగో, హామ్‌లేస్, అజియో, టిరా బ్యూటీ, డ్యూరోఫ్లెక్స్, కూరాడెన్ ఇండియా సంస్థలు స్వీయ ఆడిట్లు పూర్తి చేసి డార్క్ ప్యాటర్న్స్‌ను తొలగించినట్లు తెలిపాయి.

## రెస్టరంట్లు, అపార్ట్‌మెంట్లలోకి
# ఆధార్ ఉంటేనే ఎంట్రీ?.. త్వరలో కొత్త నిబంధన!

రోజువారీ జీవితంలో ఆధార్ వినియోగం సర్వ సాధారణమైపోయింది. రానున్న రోజుల్లో దీని వాడకం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఓ కీలక మార్పు తీసుకురానుండటమే అందుకు కారణం. దీంతో హోటల్, రెస్టరెంట్, అపార్ట్‌మెంట్ ఇలా ఎక్కడికి వెళ్లినా ఆధార్ యాక్సెస్ తప్పనిసరి అవ్వొచ్చు. ఆ మేరకు 'యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా' త్వరలో కొత్త విధానం తీసుకురానుంది. అదే ఆఫ్‌లైన్ వెరిఫికేషన్. దీనికి సంబంధించి కొత్త యాప్‌ను తీసుకురాబోతున్నట్లు ఇటీవలే ప్రకటించింది.

**దుర్వినియోగం కాకుండా..**

ఇప్పుడు కూడా చాలా ప్రదేశాల్లో ఆధార్ తప్పనిసరి నిబంధన ఉంది. అలాంటి చోట ఒరిజినల్ ఆధార్‌ను చూపించడంతోపాటు జిరాక్స్ కాపీని ఇవ్వాల్సి వస్తోంది. దీనివల్ల వ్యక్తుల కీలక వివరాలు దుర్వినియోగమవుతున్నాయి. దీన్ని నివారించడం కోసం ఆధార్ కార్డుపై వివరాలేమీ లేకుండా కేవలం క్యూఆర్ కోడ్, ఫొటో మాత్రమే ఉండేలా మార్పు తీసుకొచ్చే యోచనలో కేంద్రం ఉంది. అలాగే ఆఫ్‌లైన్ ఐడీ చెక్‌ను కూడా ప్రవేశపెడితే ఆధార్ హార్డ్ కాపీలు చూపించాల్సిన అవసరం ఉండదు.



*** ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ పనిచేసే విధానం**

UIDAI అధికారులు చెప్పిన ప్రకారం.. కొత్త ఆఫ్‌లైన్ ధ్రువీకరణ వ్యవస్థను పూర్తిగా క్యూఆర్ కోడ్ ఆధారంగా రూపొందిస్తారు. 'ప్రూఫ్ ఆఫ్ ప్రజెన్స్' అనే సరికొత్త సాంకేతికతను వాడతారు. UIDAI సర్వర్లకు కనెక్ట్ కాకుండానే ముఖాన్ని స్కాన్ చేసి వ్యక్తిని ధ్రువీకరించుకుంటారు. ఇది ప్రస్తుతం బ్యాంకులు వాడుతున్న ఫేస్ అథెంటికేషన్ కంటే భిన్నం. యాప్ విడుదలయ్యాక ఈ విధానం ఎలా పనిచేస్తుందో మరింత స్పష్టత వస్తుంది. ఎక్కడెక్కడ? ఈ ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ విధానం అమల్లోకి వస్తే హోటళ్లు, రెస్టరంట్లు, లాడ్జ్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఆఫీసులు, డేటా కేంద్రాలు, ఆసుపత్రులు, పరీక్షల్లో విద్యార్థులు, సినిమా హాళ్లు, స్టేడియాలు, కచేరీలు.. ఇలా అనేక చోట్ల ఆధార్ యాక్సెస్‌తో ఎంట్రీకి అవకాశం ఉంది. దీనికి సంబంధించిన నిబంధనలను UIDAI త్వరలో విడుదల చేయనుంది.


## రెండో టెస్టులో గిల్ ఆడతాడా?
# అప్‌డేట్ ఇచ్చిన బ్యాటింగ్ కోచ్



భారత్, సౌతాఫ్రికా మధ్య నవంబర్ 22 నుంచి గువాహటిలో రెండో టెస్టు ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడతాడా? లేదా అనేది మ్యాచ్‌కు ముందు రోజు (నవంబర్ 21) తేలుతుందని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తెలిపాడు. శుక్రవారం అతనికి ఫిట్‌నెస్ నిర్వహిస్తారని, అనంతరం మ్యాచ్‌లో ఆడాలా? వద్దా అనేది ఫిజియో, డాక్టర్లు నిర్ణయిస్తారని పేర్కొన్నాడు. కోల్‌కతా టెస్టులో గిల్ మెడ నొప్పి కారణంగా ఆట మధ్యలోనే మైదానాన్ని వీడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీమ్‌ఇండియాతోపాటు గువాహటికి వెళ్లిన భారత కెప్టెన్.. ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడు. 'శుభ్‌మన్ గిల్ వేగంగా కోలుకుంటున్నాడు. నిన్న అతడితో మాట్లాడా. అతను మ్యాచ్ ఆడాలా? వద్దా అనే దానిపై రేపు (శుక్రవారం) సాయంత్రం ఫిజియో, డాక్టర్లు తుది నిర్ణయం తీసుకుంటారు. గిల్ పూర్తిగా కోలుకుని మళ్లీ సమస్య రాకుంటే ఆడతాడు. ఆట మధ్యలో మళ్లీ నొప్పి రాకుండా ఉండటం ముఖ్యం. ఏదైనా సందేహం ఉంటే విశ్రాంతి తీసుకుంటాడు. ఏ జట్టు అయినా శుభ్‌మన్ గిల్ వంటి కెప్టెన్, ప్లేయర్‌ని మిస్ కావాలని కోరుకోదు. అతను ఆడకపోతే భారత్‌కు మంచి ప్రత్యామ్నాయ ఆటగాళ్లున్నారు. అతని స్థానంలో వచ్చే ఆటగాడు సెంచరీ చేస్తాడేమో. గత మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో ఓడింది. గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసి ఉంటే 30 పరుగులు పెద్ద విషయం కాదు' అని సితాన్షు కోటక్ వివరించాడు.




## ఐపీఎల్ ఆరు నెలల లీగ్‌గా మారాలి..
# వేలంను ఆపేయండి
### : భారత మాజీ క్రికెటర్




ఐపీఎల్‌లో వేలం ప్రక్రియను తొలగించి ఏడాది పొడవునా ఆటగాళ్లను ట్రేడ్ చేసుకోవడానికి వీలు కల్పించి, డ్రాఫ్ట్ సిస్టమ్‌కు మారాలని మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప అభిప్రాయపడ్డాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా లీగ్‌లో మార్పులు చేయాలన్నాడు. ఈ లీగ్‌ను రెండున్నర నెలల నుంచి ఆరు నెలల టోర్నీగా మార్చాలని సూచించాడు. ఉతప్ప రెండుసార్లు (కోల్‌కతా, చెన్నై తరఫున) ఐపీఎల్ టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో 205 మ్యాచ్‌లు ఆడి 4,952 రన్స్ చేశాడు. 2014లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో 660 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. 'వాళ్లు దీన్ని స్టార్టప్ దశకు మించి తీసుకెళ్లడం లేదు. ఇది ఆశ్చర్యంగా ఉంది. ఐపీఎల్ ప్రపంచంలోనే అగ్రగామి క్రికెట్ లీగ్. మారుతున్న కాలానికి అనుగుణంగా మన ఆలోచనలూ మారాలి. వేలం ప్రక్రియను నిలిపివేసి సంవత్సరం పొడవునా ట్రేడ్ విండోను తెరిచి ఉంచండి. ఆక్షన్‌ను వదిలేసి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకురండి. నేను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయం చెబుతున్నా. వారు టీవీ వినోదం గురించే ఆలోచిస్తున్నారు. డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పది కావొచ్చు. ఇది అభిమానులను ఆకట్టుకుంటుంది. దీన్ని అమలు చేయండి. అంతేకాకుండా ఐపీఎల్ ఆరు నెలల లీగ్‌లాగా ఉండాలని నేను భావిస్తున్నాను. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లను కలిగి ఉండవచ్చు. కానీ, ఐపీఎల్ అభివృద్ధి చెందాలి' అని రాబిన్ ఉతప్ప పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 మినీ వేలం అబుదాబిలో డిసెంబరు 16న జరగనుంది.

**ఏమిటీ డ్రాఫ్ట్ సిస్టమ్?**

క్రికెట్‌లో డ్రాఫ్ట్ సిస్టమ్ అనేది ఆటగాళ్లను సమాన పద్ధతిలో జట్లకు కేటాయించడానికి ఉపయోగించే ఒక విధానం. అత్యుత్తమ ప్రతిభను కనబర్చే క్రికెటర్లపై ఒక ఫ్రాంఛైజీకి గుత్తాధిపత్యం ఉండకుండా జట్ల బలబలాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి దీన్ని ప్రవేశపెట్టారు. డ్రాఫ్ట్‌లో అర్హత ఉన్న ఆటగాళ్ల సమూహం నుంచి జట్లు వంతులవారీగా ఎంపిక చేసుకుంటాయి. ఒక జట్టు ఒక ఆటగాడిని ఎంచుకుంటే ఆ ప్లేయర్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రత్యేక హక్కులను పొందుతుంది. లీగ్‌లోని ఏ ఇతర జట్టు కూడా ఆ ఆటగాడిని తీసుకోవడానికి వీలు లేదు. బిగ్ బాష్ లీగ్, పాకిస్థాన్ సూపర్ లీగ్, ది హండ్రెడ్ వంటి అనేక లీగ్‌ల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు.

## నీళ్ల సీసాలు అందించి పెద్ద ఇల్లు కట్టుకున్నా..
# భారత మాజీ స్టార్ సరదా వ్యాఖ్య

భారత మాజీ వికెట్ కీపర్, బ్యాటర్ పార్థివ్ పటేల్ ఇటీవల ఓ కామెడీ షోలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా నీటి గురించి చర్చ రాగా.. 2003 ప్రపంచ కప్‌లో ఆటగాళ్లకు నీటి సీసాలు మోసుకెళ్లి పెద్ద ఇల్లు కట్టుకున్నానని చమత్కరించాడు. 2002లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన పార్థివ్.. 2003 ప్రపంచ కప్‌నకు ఎంపికయ్యాడు. కానీ, ఒక్క మ్యాచ్‌లోను తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఆ టోర్నీ ఫైనల్‌లో భారత్ 125 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 'నీళ్ల గురించి మాట్లాడకండి. నేను చాలా మ్యాచ్‌ల్లో



'వాటర్ బాయ్'గా ఉన్నా. రాహుల్ ద్రవిడ్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చూస్తున్నప్పుడు డ్రింక్స్ తీసుకెళ్లా. 2003 ప్రపంచకప్ మొత్తం నేను మైదానంలో ఉన్న సహచర ఆటగాళ్లకు నీళ్ల సీసాలు అందించా. కానీ, ఆ సమయంలో నీళ్ల సీసాలు మోసుకెళ్లి పెద్ద ఇల్లు కట్టుకున్నాను' అని పార్థివ్ చమత్కరించాడు. పార్థివ్ చాలా చిన్న వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. 2002లో ఇంగ్లాండ్‌లో భారత్ తరఫున తొలి టెస్టు ఆడాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అతి పిన్న వయసులో (17 ఏళ్ల 152 రోజులు) అరంగేట్రం చేసిన వికెట్ కీపర్ ఇతనే. తన తొలి విదేశీ పర్యటనను గుర్తుచేసుకుంటూ ఇంగ్లాండ్ ప్లేయర్ ఆండ్రూ ఫ్లింటాఫ్ తనను స్లెడ్జ్ చేసినట్లు పార్థివ్ పేర్కొన్నాడు. కానీ, అతను ఏమన్నాడో తనకు అర్థం కాలేదన్నాడు. భారత్ తరఫున 25 టెస్టులు, 38 వన్డేలు, 2 టీ20లు ఆడిన పార్థివ్ పటేల్.. 2018లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ (టెస్టు) ఆడాడు. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు.


# సినిమా



# నెగెటివ్ టాక్ వస్తే..

అఖిల్ రాజ్, తేజస్వి రావు జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' నవంబర్ 21న రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈటీవీ విన్ ఒరిజినల్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాకు సాయిలు కంపాటి స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన ప్రతి అప్‌డేట్ మంచి అంచనాలు తీసుకొచ్చింది. ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో సాయిలు చేసిన కామెంట్స్ మాత్రం టాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారాయి. ''మా టీమ్ ఎంత కష్టపడిందో మీకు సినిమా చూస్తే అర్థమవుతుంది. మన కష్టానికి తగిన ఫలితం తప్పకుండా వస్తుంది'' అంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం చేయొద్దని కోరుతూ.. 'ఈ సినిమాకు నెగెటివ్ టాక్ వస్తే అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతా!" అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమా టీమ్ కష్టాన్ని నమ్మి ఇలాంటి ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు. సాయిలు కంపాటి స్టేట్‌మెంట్ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి సినిమాపైనే పడింది.

# సమంత సూపర్





ఫ్యామిలీ మ్యాన్ -3 వెబ్ సిరీస్ రేపటి నుంచి ఆమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కానుంది. రాజ్ -డీకే రూపొందించిన ఈ యాక్షన్ స్పై డ్రామా స్ట్రీమింగ్ కానుండటంతో ప్రమోషన్లు జోరుగా సాగుతున్నాయి. తాజాగా, దర్శకుడు రాజ్ నిడుమోరు ఓ ఇంటర్వ్యూలో సమంత, నిమ్రత్ కౌర్ నటన గురించి మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. "ఈ సిరీస్ కోసం రాసిన పాత్రలు మొదట ఎవరికీ అనుగుణంగా రాయలేదు. కాని సమంత అయినా, నిమ్రత్ కౌర్ అయినా తమ పాత్రల్లో అద్భుతంగా నటించారు. వాళ్ల పాత్రలు ఈజీగా చేయొచ్చు. అయినా సరే వాళ్లు అందులో కష్టపడి జీవించేశారు. పాత్రలో నటించేది పురుషుడైనా, మహిళైనా అని నేను ఎప్పుడూ పట్టించుకోను. నా దృష్టిలో ఇద్దరూ సమానమే. స్క్రిప్ట్ డిమాండ్ ఏంటో అదే ఫాలో అవుతా అని చెప్పుకొచ్చాడు. రాజ్ నిడమోరు కామెంట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫ్యామిలీ మ్యాన్ మూడో సీజన్‌లో ప్రతి ఎపిసోడ్ ఒక సినిమాలా ఉంటుందని ఆయన తెలిపారు. దీని షూటింగ్‌ను వేర్వేరు ప్రదేశాల్లో చేసినట్లు చెప్పారు. ఇది వారికి ఒక ఫీచర్ ఫిల్మ్‌తో సమానమన్నారు.



## ఓటీటీలోకి సైకలాజికల్ థ్రిల్లర్.. 'స్టీఫెన్' స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు నేరుగా మరో సినిమా ఓటీటీలో విడుదలకు సిద్ధమవుతోంది. డిసెంబరు 5 నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. అదే సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'స్టీఫెన్'. 'గార్గి' ఫేమ్ గోమతి శంకర్ ప్రధాన పాత్రలో కొత్త దర్శకుడు మిథున్ బాలాజీ రూపొందించిన చిత్రమిది. ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌ను తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీలో అందుబాటులో ఉంచనున్నట్లు ఓటీటీ సంస్థ ప్రకటించింది. ''దక్షిణాది సినిమాలు, సిరీస్‌లకు సంబంధించి మా లైనప్‌లోని 'స్టీఫెన్' ఆసక్తికరమైంది. ఓ సీరియల్ కిల్లర్ చుట్టూ తిరిగే కథ ఇది. తర్వాత ఏం జరుగుతుంది? అని చివరి వరకూ ప్రేక్షకుడిలో ఉత్కంఠ రేకెత్తిస్తుంది. తొలి ప్రయత్నంలోనే మిథున్ బాలాజీ మిమ్మల్ని మెప్పిస్తారు'' అని నెట్‌ఫ్లిక్స్ కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఇండియా) మోనికా షేర్గిల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆ సినిమా పోస్టర్ చూసి నన్ను తిట్టారు


**: దర్శకుడు రవిబాబు**



తనకు మార్కెటింగ్ చేసుకోవడం తెలియదని దర్శకుడు రవిబాబు అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హాస్యం కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుందన్నారు. అందుకే తాను ఎక్కువగా విజువల్స్‌కు ప్రాధాన్యం ఉండేలా చూస్తానన్నారు. ''అవును సినిమాలో ఆ హీరోయిన్ పెద్ద ఇబ్బందుల్లో పడుతుంది. దాన్ని విజువల్‌గా ఎలా చూపించాలి అని ఆలోచించి.. ఏనుగు పెద్ద జంతువు కాబట్టి ఏనుగంత ప్రాబ్లమ్‌లో హీరోయిన్ ఉంది అని చెప్పడం కోసం పోస్టర్ చేయించా. ఆ పోస్టర్ చూసి ఒక వ్యక్తి నాకు ఫోన్ చేసి తిట్టాడు. ఏనుగు ఉందని పిల్లల్ని తీసుకొని సినిమాకు వెళ్తే సినిమాలో ఏనుగు లేదన్నాడు. ఆయనకు సారీ చెప్పి పెట్టేశాను. ఈ సినిమా చూసి మరో మహిళ ఫోన్ చేశారు. శరీరం లేని వ్యక్తి, కళ్లకు కనిపించని వ్యక్తి హీరోయిన్‌ను ఎలా కలవాలని అనుకుంటాడు అని నాతో వాదించారు. ఆమెకు నేను ఆ సినిమా కథే అది అని వివరించలేకపోయాను''. ''ప్రేక్షకులు మనం తీసే సినిమాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి. కొన్ని సినిమాల్లో నన్ను విలన్‌గా చూసినవారు ఇప్పటికీ నేను ఎదురుగా కనిపిస్తే భయంతో వెళ్లిపోతున్నారు. సినిమాలు ప్రేక్షకులపై అంతగా ప్రభావం చూపుతాయి. అందుకే సున్నితమైన అంశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలి'' అని రవిబాబు చెప్పారు. తనకు సినిమాలు మార్కెటింగ్ చేసుకోవడం రాదని తెలిపారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు చిరాకు తెప్పిస్తాయన్నారు. అలాంటి ఈవెంట్‌లు పెట్టి నటీనటులను అవసరానికి మించి పొగుడుతూనే ఉంటారని అలా ఎందుకు చేస్తారో ఇప్పటికీ తనకు అర్థం కాదన్నారు. అందుకే తాను ఈవెంట్‌లకు రానని చెప్పారు.

## అంతా తికమక

ఇటీవల క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన భార్య నటాషా నుంచి విడిపోయిన తర్వాత విదేశీ మోడల్‌తో డేటింగ్‌లో ఉన్నాడని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మోడల్ కమ్ నటి మిహీక శర్మతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. తాజాగా ఆమెతో కలిసి జిమ్ చేసిన హార్దిక్ నటిని ఎత్తుకొని క్లోజ్‌గా హగ్ చేసుకుని కనిపించాడు. ఈ ఫొటోలలో వీరితో పాటు హార్దిక్ పాండ్యా, నటాషాల కొడుకు అగస్త్య పాండ్యా కూడా ఉన్నాడు. ఇక నటాషా అలెగ్జాండర్ అలెక్స్ ఇలిక్ అనే ఫిట్‌నెస్ కోచ్‌తో సన్నిహితంగా ఉన్న ఫొటోలు కూడా వైరల్‌గా మారాయి. ఇద్దరూ కలిసి జిమ్ చేస్తున్న ఫొటోలు బయటికి రావడంతో వారి మధ్య కెమిస్ట్రీ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక అలెక్ట్ ఇలిక్ ఇంతకుముందు టైగర్ ష్రాఫ్ నుంచి విడిపోయిన దిశా పటానీతో డేటింగ్ చేశాడనే టాక్ కూడా ఉంది. ఇప్పటి వరకు ఈ జంటల డేటింగ్‌లు ఏవి కూడా అధికారికంగా కన్ఫామ్ కానప్పటికీ అంతా తికమక అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.





## సమస్య మీలోనే ఉంది.. ట్రోలర్స్‌కు రాజ్‌కుంద్రా కౌంటర్

శిల్పాశెట్టి దంపతులు కొన్ని రోజులుగా వరుసగా వార్తల్లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా వారు మరోసారి హాట్‌టాపిక్‌గా మారారు. ఇటీవల శిల్పాశెట్టి బాలీవుడ్ సెలబ్రిటీలతో కలిసి ఆధ్యాత్మిక గురువు ధీరేంద్ర కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్రకు సంబంధించిన ఫొటోలను షేర్ చేస్తూ కొందరు ట్రోల్ చేయడం ప్రారంభించారు. 'ఇందులో పాల్గొన్న చాలా మంది సెలబ్రిటీలపై కేసులు ఉన్నాయి. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవడం కోసం ఇలా పాదయాత్రలు చేస్తున్నారు' అని విమర్శిస్తూ పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్‌కు రాజ్‌కుంద్రా ఘాటుగా స్పందించారు. "చీకటిలో ఉండాలనుకునేవారు ఎప్పటికీ ఇలానే నిందలు వేస్తూ ఉంటారు. ఆరోపణలు వచ్చినంత మాత్రాన శిక్ష పడినట్లు కాదనే నిజాన్ని ట్రోల్ చేసే వారు మర్చిపోతున్నారు. కొందరు ఎప్పుడూ శాంతిని కోరుకుంటారు. మరికొందరు ఎప్పటికీ ఇలా ట్రోల్ చేస్తూనే ఉంటారు. సనాతనధర్మం కోసం నిలబడటం, భక్తిని ప్రదర్శించడం, ఆధ్యాత్మిక లక్ష్యానికి మద్దతు ఇవ్వడం మిమ్మల్ని బాధ పెడుతుంటే సమస్య మీలోనే ఉన్నట్లు అర్థం. మాకు అలాంటి విషయాలు ఎప్పటికీ సమస్యగా అనిపించవు. అయినా.. చట్టం తన పని తాను చేసుకుంటుంది. నిజం బయటకు రావడానికి కొంత సమయం పడుతుంది. ఈలోపు మీలాంటివారు ఇలా స్క్రీన్‌షాట్‌లు తీసుకుంటూ జీవించండి" అని రాజ్ కుంద్రా రిప్లై పెట్టారు. ఇటీవల శిల్పా శెట్టి దంపతులపై కేసు నమోదైన విషయం తెలిసిందే. పెట్టుబడి ఒప్పందానికి సంబంధించి రూ.60 కోట్లు మోసం చేశారని శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలపై దీపక్ కొఠారి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జుహు పోలీసులు కేసు నమోదు చేశారు.



# హనుమంతుడిపై వ్యాఖ్యల వివాదం: రాజమౌళిపై ఫిర్యాదు

* **రామోజీ ఫిల్మ్ సిటీ ఈవెంట్ చుట్టూ రాజకీయ చర్చ**

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి): రామోజీ ఫిల్మ్ సిటీలో ఇటీవల జరిగిన "వారణాసి" సినిమా టైటిల్ రిలీజ్ వేడుక కొత్త వివాదానికి దారితీసింది. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి చేసిన వ్యాఖ్యలు శ్రీ హనుమంతునిపై అవమానకరంగా ఉన్నాయని ఆరోపిస్తూ యుగ తులసి పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు కె. శివకుమార్, న్యాయవాది వినోద్, శ్రీరామ్ జోషి, సందీప్, శ్రీకాంత్, నాగి రెడ్డి, లక్ష్మణ్, చంటి తదితరులు అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో రాజమౌళిపై తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. "భావోద్వేగాలకు సంబంధించిన మతపరమైన అంశాలపై వ్యాఖ్యలు దేశంలో విభజనాత్మక వాతావరణాన్ని సృష్టిస్తాయి" అని శివకుమార్ అన్నారు. ఆయన రాజమౌళి ప్రజల భావాలను గౌరవించాలని, మత చిహ్నాల పై సార్కాస్టిక్





వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు.

**ఫిర్యాదుపై పోలీసుల స్పందన**

అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు ఈ సంఘటనపై ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు సమాచారం. ఫిర్యాదులో పేర్కొన్న వీడియో క్లిప్‌లు, సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా అంశాన్ని పరిశీలిస్తామని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకు ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదవలేదని, సాక్ష్యాల సేకరణ అనంతరం తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. సోషల్ మీడియా ప్రతిస్పందనఈ ఘటనపై సోషల్ మీడియాలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది సినీప్రేమికులు రాజమౌళి వ్యాఖ్యలను "సినిమా సందర్భంలో చెప్పిన సృజనాత్మక వ్యాఖ్యలు" అని సమర్థిస్తున్నారు. మరికొందరు మాత్రం మతపరమైన చిహ్నాలపై సినీ ప్రముఖులు జాగ్రత్తగా ఉండాలని అభిప్రాయపడుతున్నారు.

**"హనుమంతుడు భక్తి, శక్తికి ప్రతీక**

ఆయనపై సరదా వ్యాఖ్యలు అనవసరం" అని పలువురు యూజర్లు సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. సినీ ప్రపంచంలో ప్రతిస్పందనకొంతమంది దర్శకులు, రచయితలు కళా స్వేచ్ఛను రక్షించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ, "వివేచనగా వ్యవహరించాలి కానీ సృజనాత్మక స్వేచ్ఛను నిరోధించడం మంచిది కాదు" అంటున్నారు. మరోవైపు, తెలుగు సినీ పరిశ్రమలోని కొందరు ప్రముఖులు వ్యాఖ్యలు మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీయవచ్చని రాజమౌళికి సూచించినట్లు తెలిసింది. రాజకీయ కోణంఈ సంఘటనకు రాజకీయ రంగు కూడా వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. మతపరమైన అంశాలు సాధారణంగా ప్రజా చర్చలను వేడెక్కిస్తాయి. "హనుమంతుడు" వంటి భావప్రతీకల చుట్టూ వివాదం తలెత్తడం రాజకీయ పార్టీల ఆవిష్కరణలకూ, ప్రజాభిప్రాయ చర్చకూ దారితీయవచ్చు. ముగింపు సినిమా ప్రచార కార్యక్రమంలో ప్రారంభమైన ఈ వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్ దాకా వెళ్ళింది. రాజమౌళి స్పందన కోసం సినీ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఈ కేసు విచారణ దిశ, భవిష్యత్తులో సినీ ప్రముఖులు మతపరమైన విషయాలపై ఎలా స్పందించాలో మార్గదర్శకం కావచ్చని సమాజ వర్గాలు చెబుతున్నాయి.

## ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ టి.ఎస్.టి.సి.ఏ డిమాండ్

* **మహావీర్ కాలేజీ అక్రమాలపై జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు..**

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి): తెలంగాణలోని కొన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో జరుగుతున్న దారుణాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని టి.ఎస్.టి.సి.ఏ రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్ డిమాండ్ చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) కు అనుబంధంగా ఉన్న మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో గురువారం రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావును కలిసి తమ సమస్యలు వివరించారు. అధ్యాపకులు సవ్యంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కళాశాల యాజమాన్యం వారి సర్టిఫికెట్లను అక్రమంగా తమ వద్ద ఉంచి ఇబ్బందులు పెడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో టి.ఎస్.టి.సి.ఏ ప్రతినిధులు రిజిస్ట్రార్‌ను కలసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు సానుకూలంగా స్పందించారు. నిబంధనల ప్రకారం అధ్యాపకుల హక్కులను కాపాడేందుకు



తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, అనుభవం ఉన్న అధ్యాపకులను సద్వినియోగం చేసేందుకు సేవా వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించినట్లు టి.ఎస్.టి.సి.ఏ నాయకులు తెలిపారు. ఈ సూచనపై కూడా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. తెలంగాణలో ప్రైవేట్ కాలేజీల్లో జీతాల చెల్లింపులో లోపాలు, ఉద్యోగ భద్రతపై అనిశ్చితత్వం తరచుగా చర్చనీయాంశమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూహెచ్ అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటే, ఇతర కళాశాలల్లో ఉన్న అధ్యాపకులకూ ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో అయినేని సంతోష్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదే కాదు.. దేశ అభివృద్ధిలో కీలక ముందడుగు

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి): ఉపాధిని పెంచడం, ఆయా రంగాలలో ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ శ్రామికశక్తిని నిర్మించడం వైపు దృష్టి సారించామని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ లాజిస్టిక్స్ రంగం అధిక వృద్ధి దశాబ్దంలోకి ప్రవేశిస్తున్నదని.. ఇది భారతదేశ లాజిస్టిక్స్ రంగానికి సాంకేతికత ఆధారిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఒక ప్రధాన అడుగు అని అన్నారు. దీనికి జాతీయ లాజిస్టిక్స్ విధానం, ప్రధానమంత్రి గతిశక్తి, మల్టీమోడల్ మౌలిక సదుపాయాలలో అపూర్వమైన పెట్టుబడులు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని నిర్మించుకుంటేనే ఈ పరివర్తన కొనసాగుతుందని చెప్పారు. రెడింగ్టన్ లిమిటెడ్ సీఎస్ఆర్ విభాగం, రెడింగ్టన్ ఫౌండేషన్, లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ భాగస్వామ్యంతో



ఈ కేంద్రాన్ని స్థాపించిందని తెలిపారు. చెన్నైలోని సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్ విజయం ఆధారంగా హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్ ప్రారంభించినట్లు చెప్పారు. సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్, హైదరాబాద్ వంటి కేంద్రాలు తదుపరితరం లాజిస్టిక్స్ నైపుణ్యం ఎలా ఉండాలో చూపిస్తాయని.. టెక్నాలజీ ఆధారితం, పరిశ్రమరూపకల్పన, నిజమైన కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా ఆటోమేషన్, డిజిటల్ సరఫరా గొలుసులు, కొత్త మొబిలిటీ నమూనాలు ఈ రంగాన్ని బలోపేతం చేస్తాయన్నారు. రెడింగ్టన్ లిమిటెడ్‌లోని గ్లోబల్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ఆర్.వెంకటేశ్ మాట్లాడుతూ చెన్నైలోని సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్, టెక్నాలజీ ఎనేబుల్డ్ లెర్నింగ్ భారతదేశ లాజిస్టిక్స్ వర్క్‌ఫోర్స్ ఉపాధిని ఎలా మార్చగలదో నిరూపించిందన్నారు. సెక్టార్‌నిర్దిష్ట సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అభివృద్ధి చేయడంపై మంత్రిత్వ శాఖ దృష్టి సారించినట్లు చెప్పారు.



## బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్దత కల్పించాలి

ఎల్బీనగర్, నవంబర్ 20 (భారత శక్తి): బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ పద్దతి కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం అల్కాపురిలో మీడియాతో మాట్లాడారు. బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. కోర్టు తీర్పు రాకముందే ఎన్నికలకు ఎలా పోతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ లకు చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. బిసి రిజర్వేషన్లపై బీసీల తరపున పోరాడతానని రాష్ట్రీయ లోక్ దళ్ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జయంత్ సింగ్ ఒప్పుకున్నారని తెలిపారు. ప్రజలను మోసం చేయడానికే పార్టీ సింబల్ లేని ఎన్నికలు పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రిజర్వేషన్ హక్కు ఓట్లలో వాటా ఉన్నపుడు హక్కులలో కూడా వాటా కావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ అంశంపై ఉద్యమం తెలంగాణలోనే ప్రారంభమైందని ఇది దేశవ్యాప్తంగా మారుతుందన్నారు. చరణ్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ వేశారని తెలిపారు. ఎన్నికలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ బస్సుల విధానంపై దేశవ్యాప్త చర్చలు..
### 23న చెన్నైలో కీలక జాతీయ సదస్సు

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి): విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ఆర్టీసీలకు మరింత అవకాశాలు కల్పించాలన్న డిమాండ్‌తో, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 23న చెన్నైలో జరగనున్న జాతీయ సదస్సుకు టీజీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాలను హాజరుకావాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ ఆహ్వానించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు సంయుక్తంగా చేసిన ప్రకటనలో, విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ హక్కులను ఆర్టీసీలకే ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తెస్తున్న కొత్త విధానంలో సమూల మార్పులు అవసరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 56 ఆర్టీసీల కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొననున్న ఈ సదస్సులో, ప్రస్తుతం అమల్లో ఉన్న ఫేమ్, పీఎంఈడ్రైవ్ వంటి పథకాల ద్వారా పీపీపీ మోడల్‌లో జీసీసీ కాంట్రాక్టులను ప్రవేశపెట్టడం వల్ల సబ్సిడీలు కార్పొరేట్లకు మళ్లుతున్నాయని వారు విమర్శించారు. ఈ విధానం ఆర్టీసీలను మరింత




నష్టాల్లోకి నెడుతుందని, భవిష్యత్తులో ఆర్టీసీ బస్సుల వ్యవస్థ సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న 1,40,000 ఆర్టీసీ బస్సులను పూర్తిగా విద్యుత్ బస్సులుగా మార్చాలన్న కేంద్ర నిర్ణయం ఉద్యోగ భద్రతపై ప్రభావం చూపుతుందని యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వము కూడా హైదరాబాద్‌లో 2,000 బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చే ప్రక్రియను ప్రారంభించిందని గుర్తుచేశారు. ఈ మొత్తం పరిణామాలపై విస్తృత చర్చ జరిపి, దేశంలోని అన్ని ఆర్టీసీ కార్మిక సంఘాల అభిప్రాయాలను సమగ్రంగా తీసుకుని ఐక్యంగా ముందుకు వెళ్లడం కోసం ఈ సదస్సు ఏర్పాటు చేసినట్టు వీరాంజనేయులు, వీఎస్ రావు వెల్లడించారు.

## శబరిమలలో గుండె పోటుతో శంకర్‌పల్లికి చెందిన భక్తుడు మృతి

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి): శబరిమల దర్శనానికి వెళ్లిన శంకర్‌పల్లికి చెందిన అయ్యప్ప భక్తుడు మల్లికార్జున రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. పంబ నదిలో స్నానం అనంతరం స్వామి సన్నిధానం చేరుకునే మార్గంలో పులిమెడ వద్ద అస్వస్థతకు గురయ్యారు. పరీక్షించిన వైద్య సిబ్బంది మృతి చెందినట్టు నిర్ధరించారు. మల్లికార్జున్ రెడ్డి మృతితో బుల్కాపూర్ వార్డులో విషాద ఛాయలు అలముకున్నాయి.



## విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త..
### స్కాలర్‌షిప్స్‌పై బిగ్ అప్‌డేట్

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి): జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ప్రజా భవన్‌లో ఆర్థికశాఖతో పాటు సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 2,813 జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన రూ.161 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నట్టుగా అధికారుల సమీక్షలో నిర్ధారించారు. ఈ మొత్తం రూ.161 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్...

బీహార్, నవంబర్ 20 (భారత శక్తి) : జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది. నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

## ఒకేసారి 130 మందికి ప్రమోషన్లు.. రేవంత్ సర్కార్ కీలక ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి) : తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైల్‌కు మోక్షం కల్పిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో సుమారు 140 మందికి పైగా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలోని గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు. 2018 కంటే ముందు ప్రమోషన్ పొందిన వారికి 10 శాతం కోటా కింద ఇప్పుడు సూపరింటెండెంట్లుగా అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలోని రెండు మల్టీ జోన్ల పరిధిలో అర్హులైన 9 మందికి పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (పీఆర్, ఆర్డీ) శాఖ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 130 మందికి పైగా సీనియర్ అసిస్టెంట్లకు ఒకేసారి సూపరింటెండెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత మంత్రులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పీఆర్, ఆర్డీ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు.

## తెలుగులో మాట్లాడండి: కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సూచన


హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి) :వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా ఒక కలెక్టర్ ఆంగ్లంలో వివరాలు తెలియజేస్తుండగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగులో మాట్లాడాలని సూచించారు. మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆంగ్లంలో వివరాలు వెల్లడించే ప్రయత్నం చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలుగజేసుకుని తెలుగులో మాట్లాడాలని అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా ఉన్నారని, వారందరికీ అర్థమయ్యేలా వీలైనంత వరకు తెలుగులో మాట్లాడాలని ఆయన సూచించారు. దీంతో కలెక్టర్ గరిమ తెలుగులో వివరాలు వెల్లడించారు.

## విరాళాల పేరిట మోసం.. భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ

తిరుమల, నవంబర్ 20 (భారత శక్తి) : భక్తులను తప్పుదోవ పట్టించి విరాళాలు సేకరిస్తున్న కొన్ని సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ (Global Hindu Heritage Foundation), సేవ్ టెంపుల్స్ డాట్ ఆర్గనైజేషన్ (savetemples.org) వంటి సంస్థలు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తూ, భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ విరాళాలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 29న తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇలాంటి అనుమానాస్పద సంస్థలు చేసే ప్రచారాలను నమ్మవద్దని, వారి వలలో పడి విరాళాలు ఇచ్చి మోసపోవద్దని భక్తులకు ఆయన సూచించారు. భక్తులు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి మోసపూరిత చర్యలను తిప్పికొట్టాలని టీటీడీ ఛైర్మన్ కోరారు.

## ఈ నెల 24 నుంచి రైతన్నా, మీకోసం
### 10 వేలమందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, నవంబర్ 20 (భారత శక్తి) : వ్యవసాయ రంగంలో సమూల మార్పుల ద్వారా సాగును లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి రైతు ఇంటికి వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలీకాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి 'మీకోసం రైతన్నా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనున్నారు. ఈ సందర్భంగా టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ "గత 7 నెలలుగా రైతులను, వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్తున్నాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో



కలిపి రూ.6,310 కోట్లు రైతులకు చెల్లించాం. బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపట్టాం. ఇలాంటి వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాం. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతులకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలి. దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యాక్షన్ ప్లాన్ చేయాలి" అని పేర్కొన్నారు.

*** ప్రకృతి సేద్యం: అగ్రిటెక్ విధానాలతో**

**కలిగే లాభాలు వివరించాలి**

రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని అన్నారు. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుందని, ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ చేస్తున్నామని, రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాలని అన్నారు. కడపలో ప్రకృతి సాగును కూడా పరిశీలించానని, ఆ సాగు రైతులు చాలా సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల కంటే గ్రోమోర్ కేంద్రాల్లోని ఎరువుల ధర తక్కువగా ఉందని అన్నారు. "రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. రైతుల ఏ పంటలు సాగు చేశారు, వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలను, సేంద్రీయ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందనేది వివరించాలి. పూర్తి వాటర్ మేనేజ్మెంట్ ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారత వాయుసేన స్వరూపాన్నే మార్చే ప్రతిపాదన..

రష్యా, నవంబర్ 20 (భారత శక్తి) : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే నెల భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో, భారత వాయుసేన భవిష్యత్తును మార్చేసే ఒక కీలక సైనిక ప్రతిపాదనను మాస్కో తెరపైకి తెచ్చింది. ఐదో తరం సుఖోయ్ 57 (Su57) స్టెల్త్ ఫైటర్ జెట్‌కు సంబంధించిన పూర్తి టెక్నాలజీని బదిలీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు ఏ దేశం కూడా ఇంతటి ఉన్నత స్థాయి రక్షణ సాంకేతికతను భారత్‌కు అందించడానికి ముందుకు రాలేదు. రష్యా ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ రోస్‌టెక్ సీఈఓ సెర్గీ చెమెజోవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దుబాయ్ ఎయిర్ షో 2025 సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలుత రష్యాలో తయారైన సుఖోయ్ 57 ఫైటర్లను భారత్‌కు సరఫరా చేసి, ఆ తర్వాత దశలవారీగా వాటి ఉత్పత్తిని పూర్తిగా భారత్‌కు తరలిస్తామని తెలిపారు. అంతేకాకుండా, సింగిల్ ఇంజిన్ స్టెల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అయిన సుఖోయ్ 75 చెక్‌మేట్‌ను కూడా భారత్‌కు ఆఫర్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంజిన్లు, సెన్సార్లు, ఏఈఎస్ఏ రాడార్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) టెక్నాలజీ, స్టెల్త్ మెటీరియల్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేస్తామని రష్యా స్పష్టం చేసింది. భారత్‌పై ఆంక్షలు ఉన్నప్పుడు కూడా ఆయుధాలు సరఫరా చేసి అండగా నిలిచామని, ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన భాగస్వామ్యం ఉందని చెమెజోవ్ గుర్తుచేశారు. పాశ్చాత్య దేశాలు నిరాకరిస్తున్న కీలక టెక్నాలజీని రష్యా ఆఫర్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. డిసెంబర్‌లో జరగనున్న 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ భారత్‌కు రానున్నారు. ఈ పర్యటనలో రక్షణ రంగానికి సంబంధించి కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ పర్యటనకు సంబంధించిన సన్నాహక చర్చలు ప్రారంభమయ్యాయి.

## రిజర్వేషన్లు 50 శాతం మించకుండా..
### ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక నివేదికను సమర్పించింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చడానికి ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా నివేదిక సమర్పించింది. డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24వ తేదీలోపు ఎన్నికల తేదీలను ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో అదే రోజున విచారణ జరపనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ నెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. తెలంగాణ వ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో డిసెంబర్ 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది.

## మరో బస్సు ప్రమాదం..
### యాసిడ్ ట్యాంకర్ ను ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు

ఏపీ, నవంబర్ 20 (భారత శక్తి) : జడ్చర్ల మండలం మాచారం సమీపంలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యాసిడ్ ట్యాంకర్ ను ఢీ కొట్టింది. గురువారం తెల్లవారు జామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారి (ఎన్ హెచ్) 44 పై చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ముందు వెళుతున్న యాసిడ్ ట్యాంకర్ ను ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్ లో నుంచి భారీగా పొగలు వెలువడ్డాయి. జడ్చర్ల మండలం మాచారం దగ్గర 44వ జాతీయ రహదారి ఫ్లై ఓవర్□పై ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో 26 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే బస్సు కిటికీలు పగలగొట్టుకుని బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నీళ్లతో పొగలను అదుపులోకి తీసుకు వచ్చారు.

## బండి సంజయ్, కేటీఆర్‌లకు హైకోర్టులో భారీ ఊరట

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి) : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ఊరట లభించింది. వారిపై నమోదైన కేసులను న్యాయస్థానం కొట్టివేసింది. 2023లో పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్‌పై కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలతో కేటీఆర్, గోరటి వెంకన్నలపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజకీయ కక్షల కారణంగానే కేంద్ర మంత్రిపై కేసు నమోదు చేశారని బండి సంజయ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. కేసు నమోదులో సరైన



సెక్షన్లు, దర్యాప్తులో పూర్తి వివరాలు లేవని పేర్కొన్న హైకోర్టు, ఈ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలతో కేటీఆర్, గోరటి వెంకన్నలపై కేసు నమోదైంది. ప్రభుత్వ పథకాల గురించి గోరటి వెంకన్న సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద కేటీఆర్‌ను ఇంటర్వ్యూ చేశారని, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని పోలీసులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లబ్ధి చేకూర్చే విధంగా ఇంటర్వ్యూ ఉందని ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు. అయితే రాజకీయ లబ్ధి కోసం ఈ కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం వారిపై నమోదైన కేసును కొట్టివేసింది.

- తెలంగాణ రాష్ట్రంలో హోమ్ శాఖ పనితీరుపై వెల్లువెత్తున్న విమర్శలు..
- ముఖ్యమంత్రి రేవంత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హోం శాఖ..
- రాష్ట్రంలో శాంతి భద్రతలు సవ్యంగా సాగుతున్నాయా..?
- హోమ్ శాఖను ఇతరులకు కేటాయించకపోవడాన్ని కారణం ఏమిటి..?
- దుర్వినియోగం అవుతుందన్న అనుమానమా..? సిస్టం చేజారిపోతుందని భయమా..?
- ఈ శాఖతో బాటు మరిన్ని శాఖలను తనవద్ద ఉంచుకుని రేవంత్ పొరబాటు చేశాడా..?
- ఇన్ని శాఖలను సమన్వయం చేయడంలో విఫల అవుతున్న రేవంత్..
- ఎంతో కీలకమైన హోం శాఖ నిర్వీర్యం అవడం ప్రమాదం..
- ఇప్పటికైనా హోమ్ శాఖను సమర్ధవంతుడికి అప్పగించాలని సూచిస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ ".

# వెంటాడుతున్న వైఫల్యాలు..

**(స్పెషల్ కరస్పాండెంట్) :**
**హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి ) :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర హోం శాఖ ఎలా సాగుతోందో ఒకసారి తెలుసుకుందాం.. రేవంత్ తానే స్వయంగా హోమ్ శాఖను నిర్వహిస్తున్న విషయం విదితమే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీకి హోమ్ శాఖ ద్వారా లా అండ్ ఆర్డర్ సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉంది. హోమ్ మినిస్టర్ లేదా ఇతర వ్యక్తికి ఆ శాఖ అప్పగించలేదు.. ఇది ఆయనకు ప్రత్యక్ష నియంత్రణ ఇస్తుంది. దీనితో ఆయనపై, ఆ శాఖపై కొన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఎందుకంటే తెలంగాణలో శాంతి భద్రతా పరిస్థితులకు పెద్దపీఠ వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. అసలే తెలంగాణ పోరాటాల గడ్డ.. విప్లవాలకు నెలవు.. అంతేకాకుండా హైదరాబాద్ నగరం ఉగ్రవాద కార్యకలాపాలకు కూడా నెలవుగా వుంది.. ఇంకా మావోయిస్టుల కదలికలు కూడా కనిపిస్తూ ఉంటాయి.. అంతే కాకుండా నగరంలో అక్కడక్కడా రౌడీషీటర్ల కార్యకలాపాలు కూడా కనిపిస్తుంటాయి.. ఇలాంటి పరిస్థితుల్లో హోమ్ శాఖ ఎంతో పటిష్టంగా, బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా రేవంత్ రెడ్డి "ప్రజా ప్రభుత్వం" పేరుతో తాము చేసిన వాగ్ధానాలను, హామీలను నిలబెట్టుకోవాల్సి వుంది.. అయితే, శాంతి భద్రతకు సంబంధించిన కొన్ని సంఘటనలపై విమర్శలు వచ్చాయి.. ప్రత్యేకంగా బీఆర్ఎస్ నాయకులు దీనిపై తీవ్రంగా స్పందిస్తున్నారు.

**శాంతి భద్రత: ప్రస్తుత పరిస్థితి :**
ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ లాంటి నాయకులు రేవంత్ సర్కారును శాంతి భద్రతల పరంగా విఫలమైందని విమర్శిస్తున్నారు. అలాగే బీ.ఆర్.ఎస్. కేపీ వివేకానంద కూడా రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు. ఇక హరీష్ రావు వంటి మాజీ నేతలు కూడా "రెవంత్ రేడీ పాలన శాంతి భద్రతల్లో విఫలమైపోతోందని బలంగా విమర్శిస్తున్నారు..

**అంతర్గత భద్రతా సవాళ్లు :**
బీ.ఆర్.ఎస్. తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో మాఫియా గ్రూపుల ప్రభావం కూడా పెరిగింది.. అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.. బీ.ఆర్.ఎస్. ఆరోపిస్తున్నట్లు తమ నేతలపై పోలీసులు అనుచిత రీతిలో ప్రవర్తిస్తున్నారని, తమ వ్యక్తిగత వివరాలను సేకరించి పెట్టుకున్నారని ఆరోపిస్తున్నారు.. "గన్ కల్చర్" అనే పదం కూడా కొంతమంది చేస్తున్న విమర్శల్లో వినిపిస్తూ ఉండటం ఆందోళన కలిగించే విషయం.. అంటే సాంఘిక రాజకీయాల్లో హింస / అనియంత్రిత ఆయుధాల ప్రాశస్త్యం ఉందని తెలుస్తోంది..





**పోలీసింగ్ నిర్వహణ :**
శాంతి భద్రత నిర్వహణలో కొంత అపారదర్శకత ఉంది అని అనేక విమర్శలు ఉన్నాయి.. పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను ప్రభుత్వం స్వప్రయోజనాలకు వినియోగిస్తున్నారనే ఘాటైన ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.. కొన్ని సందర్భాల్లో, హింసా లేదా హింసాశ్రిత ఘటనలు జరిగినప్పుడు పోలీసులు సరిగా స్పందించలేదని ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి..

**పార్లమెంటరీ, ప్రభుత్వ నిర్వహణ :**
హోమ్ శాఖను ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షించడం వల్ల అతని రాజకీయ ప్రాధాన్యతల పరిస్థితులకు ఎక్కువ లాభమవచ్చు, అదేవిధంగా విపక్షాలను అణచివేసే కార్యక్రమాలు ఎక్కువగా జరగవచ్చు అన్నది విశ్లేషకుల వాదన.. అదే విధంగా ప్రభుత్వం "గన్ కల్చర్", అలాగే భయభ్రాంథులు కలిగించడం ద్వారా వ్యతిరేక వర్గాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే విమర్శలు కూడా వున్నాయి.. ఇది శాంతి పరంగా ఒక తీవ్రమైన సవాలు అని చెప్పుకోవచ్చు..

*** అవినీతి / క్యారప్షన్ సంబంధిత అంశాలు :**
రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత, హోమ్ శాఖ లేదా ప్రభుత్వంలో కొన్ని అవినీతి కథనాలు వినిపిస్తూనే ఉన్నాయి.. అందులో కొన్ని ముఖ్యమైనవి చూద్దాం.. :ప్రతిపక్ష నాయకులపై బెదిరింపుల వాతావరణం ఉంది అనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే భయపెడుతూ తమకు అనుగుణంగా ప్రయోజనాలను పొందుతున్నారు అని విపక్షాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి..

*** రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసింగ్ వినియోగం :**
పోలీసులకు ఓపిక లేకపోవడమో, లేదా ఉద్దేశపూర్వకంగా పోలీస్ లు కఠిన చర్యలను చేపడుతున్నట్టు కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. దీనితో ప్రభుత్వం ప్రత్యక్షంగానో పరోక్షంగానో విపక్షాలపై దాడులు చేసే అవకాశం ఉందని మేధావులు అంటున్నారు..

*** ప్రభుత్వ లోపాలు :**
రాష్ట్రంలో "అధికారం పరంగా మాఫియా కారణంగా ప్రభుత్వం కొంత అస్థిరతకు లోనయింది. కాగా బీ.ఆర్.ఎస్. నాయకు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని "మాఫియా క్యాబినెట్" అని కూడా విమర్శించగా, వారు త్వరగా కేసులు నమోదు చేయడం లేదని, ప్రత్యేకంగా రాజకీయ సంబంధిత వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనే ప్రశ్నలు వేస్తున్నారు.

*** ఈ పరిస్థితులను ఏవిధంగా చూడవచ్చు ?**
ముఖ్యమంత్రి స్వయంగా హోమ్ శాఖను నియంత్రించడం అంటే శాంతి భద్రత, పోలీస్ పాలసీపై అతను ఎక్కువ నియంత్రణ కలిగి ఉంటాడు. ఇది కొన్ని వ్యక్తులకు ప్రామాణికత ఇస్తే, ఇతరులకు భయాన్ని కలిగించవచ్చు.. ముఖ్యంగా విమర్శలకు అవకాశం ఉంది.. పోలీసింగ్ నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించబడతున్నాయి అనే. విపక్షపు వాదనలు వినిపిస్తున్నాయి.. ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తీవ్ర విమర్శలు చేస్తున్నారు.. దీనితో రాష్ట్రంలో శాంతి భద్రత క్షీణిస్తున్నదనే వాదనను కాదనలేమని మేధావులు సైతం అంటున్నారు.. హోం శాఖా మీద అవినీతి ఆరోపణలు ఉన్నందున, పారదర్శకమైన విచారణల అవసరం ఉంది..

ప్రభుత్వానికి ప్రజలకు భద్రత కల్పించడానికి, పోలీస్ సిబ్బంది శిక్షణ, ఇంటెలిజెన్స్ సామర్థ్యం, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి విధానాలను మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశేషకులతో బాటు " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ సూచిస్తోంది..





## రాష్ట్ర లోక్ దళ్ రథ యాత్రను ప్రారంభించిన కేంద్ర మంత్రి జయంత్ సింగ్ చౌదరి




ఎల్బీనగర్, నవంబర్ 20 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం హైదరాబాద్లోని రాష్ట్రీయ లోక్ దళ్ క్యాంపు కార్యాలయం వద్ద సామాజిక చైతన్య రథ్ యాత్ర రెండవ విడత కేంద్ర మంత్రి జయంత్ సింగ్ చౌదరి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ, మొదటి దశ సామాజిక చైతన్య యాత్రలో తెలంగాణ అంతటా బీసీల ఉద్యమ చైతన్యం ఎస్సీ, ఎస్టీల ఐక్యత కనిపించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్లు చీలకుండా రాజకీయం చేస్తే రాబోయే రోజుల్లో రాజ్యాధికారం వారికే దక్కుతుందన్నారు. శ్రీమతి కపిలవాయి ఇందిరా ఆర్.ఎల్.డి జాతీయ మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ, తమ పార్టీ యువతని రాజకీయాలలోకి రావాలని ప్రోశ్చహిస్తుందని సామాజిక స్పృహతో రాబోయే రోజుల్లో ఈ వర్గాలకే ఎక్కువ శాతం సీట్లు కేటాయిస్తుందన్నారు. విజిఆర్ నారగొని మాట్లాడుతూ, ఆర్.ఎల్.డి లాంటి సామాజిక చైతన్యం ఉన్న పార్టీలతో జత కట్టి అతి త్వరలో ఒక జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడుతుందని దానికి కేంద్ర మంత్రి జయంత్ సింగ్ చౌదరి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ, జయంత్ సింగ్ చౌదరి తాత అయిన చరణ్ సింగ్ మాజీ ప్రధాని ఆధ్వర్యంలో మండల్ కమిషన్ ఏర్పాటు అయిందని, ఆయన బాటలో అజిత్ సింగ్ కూడా నడిచారని, నేటి తరం యువకుడు జయంత్ సింగ్ చౌదరి కూడా బీసీలకు చట్టబద్దత కల్పించడంలో నిబద్దతతో పోరాడాలని పిలుపు నిచ్చారు. ముఖ్యఅతిధి జయంత్ సింగ్ చౌదరి మాట్లాడుతూ, ఆర్ ఎల్ డి పార్టీ మొదటి నుంచి తెలంగాణకు కట్టుబడి ఉన్న పార్టీ అని ఒక సామాజిక తెలంగాణ ఆకాంక్షించిన పార్టీ అని ఇప్పటికే బీసీలకు వారి సంఖ్యాపరంగా రిజర్వేషన్ చట్టబద్ధంగా రావాలని అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రీయ లోక్ దళ్ స్థానిక సంస్థలలో అభ్యర్థులను నిలబెడుతుందని వారికి ప్రజలు బోర్ పంపు గుర్తుకు ఓటు వేసి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.విలేకరుల సమావేశంలో టీఆర్ఎల్డీ నాయకులు కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యకులు, ఎంఎస్.బేగ్ (హైదరాబాద్ అధ్యక్షుడు), బీరప్ప (యాదాద్రి భువనగిరి అధ్యక్షుడు), ప్రధాన కార్యదర్శులు రిషబ్, విశాల్, మల్లేశ్, నరసింహరావు, సతీష్, జానీ, రాంప్రసాద్, బుల్లెట్ వెంకన్న కళా బృందం, సిద్ధం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో

## 18 ఎజెండాలు, 6 టేబుల్ ఐటమ్స్‌కు ఆమోదం

హైదరాబాద్, నవంబర్ 20 (భారత శక్తి) : గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 18 ఎజెండా అంశాలు, 6 టేబుల్ ఐటమ్‌లకు ఆమోదం లభించింది.సమావేశానికి కమిషనర్ ఆర్. వి. కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, మహ్మద్ సలీం, డా. ఆయేషా హుమేరా, మహాలక్ష్మి రామన్ గౌడ్, సి.ఎన్. రెడ్డి, మహ్మద్ బాబా ఫసియుద్దీన్, బూరుగడ్డ పుష్ప తదితరులు హాజరయ్యారు. అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ శాఖాధికారులు కూడా పాల్గొన్నారు.కమిటీ ఆమోదించిన ముఖ్యమైన టేబుల్ ఐటమ్‌లు ఇలా ఉన్నాయి:అబిడ్స్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 56 సెల్లార్ దుకాణాల కోసం టెండర్ ప్రక్రియకు అనుమతి.కుత్బుల్లాపూర్



సర్కిల్ ఆఫీస్ ప్రాంగణంలోని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ లీజును మరో మూడు సంవత్సరాలపాటు పొడిగింపు.జీహెచ్ఎంసీ వాహనాల (స్వచ్ఛ ఆటోలు, స్వీపింగ్, ఫాగింగ్ వాహనాలు తదితరాలు)పై GPS ఆధారిత వాహన ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి నిర్వహించేందుకు సర్వీస్ ప్రొవైడర్‌ను నియమించడం.ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి 50 సీట్ల ఇన్‌బౌండ్ కాల్ సెంటర్ (EMRI) ఏర్పాటు, అలాగే కాల్ సెంటర్ సర్వర్ మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడం.కాప్రా సర్కిల్‌లోని గెలీలియో నగరంలో ఓపెన్ స్పేస్‌లో స్పోర్ట్స్ అరినా అభివృద్ధి.జూబ్లీహిల్స్‌లోని హిల్‌లాక్ భూమిని ప్రైవేట్ యజమాని భూమితో మార్పిడి చేసేందుకు జీహెచ్ఎంసీ చట్టంలోని సంబంధిత సెక్షన్ ప్రకారం అనుమతి.అధికారులు వెల్లడించిన ప్రకారం, ఈ నిర్ణయాలు నగర పాలనలో పారదర్శకతను పెంచి, పట్టణ అభివృద్ధికి దోహదం చేయనున్నాయి.



## ఇద్దరు హిజ్రాలను బైండోవర్ చేసిన చైతన్యపురి పోలీసులు

ఎల్బీనగర్, నవంబర్ 20 (భారత శక్తి): చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని దిల్సుఖ్నగర్ మెట్రో స్టేషన్ రోడ్ల పైన ట్రాన్స్ జెండర్స్ అర్ధరాత్రి సమయాలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండగా చైతన్యపురి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఇద్దరు ట్రాన్స్ జెండర్స్ అయిన రత్నావత్ హయాతి @ సురేష్, గూగులోత్ చిన్నిశ్రీ @ కుమార్ అనే ఇద్దరు హిజ్రాలను పట్టుకొని వారి పైన 296 బిఎన్ఎస్ఎస్ చట్టం క్రింద కేసు నమోదు చేసి వారిని II క్లాస్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ,మండల్ తహసీల్దార్ వేణుగోపాల్ ముందు హాజరుపరిచి బైండోవర్ చేశామని సీఐ సైదులు తెలిపారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.